Pages - 60 - Rs. 10/-

# శివానంద భారతి

దివ్య జీవన ఆధ్యాత్మిక, సాంస్కృతిక మాసపత్రిక


మార్చి : 2019


శ్రీ వికారి : - మాఘం ఫాల్గుణం

సంపుటి : 17

సంచిక - 5





స్వామి శివానంద



స్వామి చిదానంద



స్వామి దేవానంద



స్వామి సత్యవ్రతానంద



మహాశివరాత్రి
శుభాకాంక్షలు



భగత్‌సింగ్



రాజగురు




సుఖదేవ్
బలిదానం : మార్చి 23

## ఏ.పి.డివైన్ లైఫ్ సొసైటీ

శ్రీ శివానందాశ్రమం, పద్మారావునగర్, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం

*Spiritual Monthly Magazine* : SIVANANDA BHARATHI

**స్వామి చిదానంద ఉషోదయ ఉపన్యాసాలు**



# (27) నీ ఉత్సాహావేశం నీలోని దైవమే !

నది ప్రవహిస్తుంది సముద్రంలో కలిసేవరకు. ఒక్కొక్కరాయి పేరిస్తేనే గోడ అవుతుంది. సుత్తిదెబ్బలతో శిల్పం అవుతుంది ; ఒక్క రోజులో కాదు, రోజులు పడతాయి. చినుకులు ఏరులూ – నదులవుతాయి.

రత్నాకరుడు వాల్మీకి కావడానికి అహర్నిశలు 'మరా–మరా' అన్నాడు. త్రికాలజ్ఞాని అయ్యాడు. శ్రీరామాయణాన్ని రచించాడు.

అమృత పుత్రులారా ! పూర్వం వారు చేసిన పనులన్నీ ఇప్పుడు మీరు చేస్తారు. మానవులందరిలోని ఆంతరంగిక శక్తి ఒక్కటే. వారు ఈ శక్తిని మనకు చూపించారు. మనం ఆ మార్గంలో పయనించడానికి కృషిచేద్దాం !

విజయం సిద్ధించాలంటే, కృషిఫలించాలంటే మనస్సును స్వాధీనంలో ఉంచుకోవాలి. నమ్మకంతో పనిచేయాలి. కావల్సింది ఒకే ఒక్క సద్గుణం ; ఉత్సాహం ; ఉత్తేజం. ఈ ఉత్సాహ ఉత్తేజాలకు మూలం ధైర్యలక్ష్మి. ఈ ధైర్యమే విజయానికి ఆధారం – మంచీ చెడు విచారం–వివేకం, విచక్షణా జ్ఞానం అన్నీ విజయానికి మూలమే.

విచార వివేకాలవల్ల ఏది నిత్యమో, ఏది అనిత్యమో తెలుస్తుంది. అనిత్యమైన మాయను ఎంత దూరాన ఉంచాలో నిర్ణయించుకోగల్గుతాం. మనం ఎందుకు జన్మించాం అని చర్చించుకొని, పోగొట్టుకొన్న దివ్యత్వాన్ని సాధించేందుకు ముందుకు నడవాలి.

అయితే ఒక్కటి గుర్తుంచుకోవాలి. నీ వద్దే, నీలోనే, నీకు సహాయం చేయడానికి సంసిద్ధుడైన దైవమే నీకు ఆధారంగా నిలిచినాడని గుర్తుంచుకోవాలి. నీకు సహాయంగా ఉన్న ఆ దైవాన్ని మరువకుండా ముందుకు సాగిపో ! ఆయనే నీ హస్తాన్ని పట్టుకొని నడుపుతాడు.

ప్రవాహ వేగానికి కొట్టుకు పోవడం కాదు. తెడ్డువేసి అనుకొన్న దిశకు వెళ్లాలి. ఆ భగవంతుణ్ణి ప్రార్థించండి ! అర్థించండి ! అది తప్పక మీకు లభిస్తుంది. పాత్రులు–అర్హులు కాబట్టే మీకు ఈ మంచిమాటలు వినే అవకాశం కల్పించబడింది. దైవమే ఉత్సాహంతో మిమ్మల్ని నడిపిస్తుంది ; దైవీకార్యాలు చేయండి !

**సంగ్రహానుసరణ : ధర్మవీర**

# శివానంద భారతి

దివ్య జీవన ఆధ్యాత్మిక, సాంస్కృతిక మాసపత్రిక

**Sivananda Bharathi**
**Spiritual Monthly Magazine**

**Vol :17 Edition: 5** సంపుటి: 17 సంచిక: 05 శ్రీవిళంబి: మాఘం ఫాల్గుణం మార్చి – 2019 **March - 2019**


**బ్రహ్మలీనులు పరమపూజ్యులు, శ్రీ స్వామి శివానంద, శ్రీ స్వామి చిదానంద, శ్రీ స్వామి దేవానంద ఆశీస్సులతో**


వ్యవస్థాపకులు :
**బ్రహ్మలీన**
**స్వామి సత్యవ్రతానంద**

సంపాదకులు :
**ఆచార్య కసిరెడ్డి**

సహ సంపాదకులు :
**తిప్పరాజు కొండల్‌రావు**

సంపాదక మండలి :
**బొప్పన అరుణాదేవి**
**జి. సుధీర్‌కుమార్**
**డా॥ ఖేరీ సునీత**
**మరీచిక**


**శివానంద భారతి చందా వివరాలు.** సంవత్సరం చందా రూ.100/- శాశ్వత చందా రూ. 1100/-. సంవత్సర చందా కన్నా ఎక్కువ పంపరాదు. శాశ్వత చందా, పత్రిక నడచినంత కాలం అని గ్రహించగలరు.

## విషయసూచిక


| | |
|---|---|
| ఆత్మీయ భారతి – విజయవంతమైన ... –ఆశ్రమ కార్యవర్గం | 4 |
| సంపాదక భారతి – హిందూస్థాన్ .... – ఆచార్య కసిరెడ్డి | 5 |
| హిందూ ధర్మ సమగ్ర స్వరూపం – స్వామి శివానంద | 9 |
| భావ పరిణతి – మనస్సు–సమత్వం – స్వామి సర్వవిదానంద | 14 |
| శ్రీ రమణతత్త్వము – శ్రీమతి బొప్పన అరుణాదేవి | 18 |
| ధ్యానం – ఓ వవిహంగ ... – అను. తిప్పరాజు కొండల్‌రావు | 21 |
| జీవుడా మేలుకో ! – బ్రహ్మలీన శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి | 25 |
| ప్రతి రాత్రీ ..... – ధర్మవీర | 27 |
| భజన భారతి – నిత్యార్చన నుండి | 30 |
| ప్రార్థన భారతి – ఆచార్య కసిరెడ్డి | 31 |
| నారాయణీయం – శ్రీమతి హేమలతా బాలసుబ్రహ్మణ్యం | 34 |
| శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం – ఆచార్య కసిరెడ్డి | 37 |
| మానసవీణ – డా॥ పర్యాద సరళ | 39 |
| ద్రవిస్తేనే దైవం – ఆకుల రామయ్య | 40 |
| స్వామి సత్యవ్రతానంద తృతీయ ఆరాధన – ఆచార్య కసిరెడ్డి | 41 |
| **Goodness Leads to Godlines** - Swami Chidananda | 47 |
| **Sri Bhagavannama Bodendra ...** - Sri Muthuraman | 50 |
| వార్తా భారతి | 52 |
| విశేష భారతి | 57 |
| **Statement of Ownership** | 58 |



**ఆయా రచయితల అభిప్రాయాలు వారివే. ఆశ్రమ పత్రిక ఆలోచనా మాధ్యమం మాత్రమే.**

## ఆత్మీయ భారతి

సేవించు, ప్రేమించు,
ధ్యానించు-సాక్షాత్కారం పొందు

### ధర్మం అంటే!

**శ్లో॥ ధృతిః, క్షమా, దమో, అస్తేయం - శౌచమింద్రియ నిగ్రహః ।**
**ధీర్విద్యా సత్యమక్రోధో - దశకం ధర్మలక్షణమ్ ॥** (మనుస్మృతి)

తా॥ ధైర్యం, సహనం, నిగ్రహం, దొంగతనం చేయకుండడం, శుభ్రత, ఇంద్రియాదులకట్టడి, బుద్ధి, విద్యా, సత్యం, అక్రోధం ఈ పది ధర్మ లక్షణాలు.

### ధర్మపథం - భారతం

**కం॥ ఒరులేయవి యొనరించిన - నరవర ! అప్రియము తన మనంబునకగు, తా**
**నొరులకు నవి సేయకునికి - పరాయణము పరమ ధర్మపథములకెల్లన్**

తా॥ ఇతరులు ఏది చేసినచో మన మనస్సునకు కష్టము కలుగునో, ఆ పని మనము ఇతరులకు చేయకూడదు. ధర్మమార్గములలో కెల్ల ఇదే గొప్పది. **- భారతం**

# విజయవంతమైన దివ్యజీవన సంఘ మహాసభలు

విజయనగరంలో తెలుగు రాష్ట్రాల 45వ దివ్యజీవన సంఘ మహాసభలు అయిదారు వేలమంది భక్తులతో దివ్యంగా జరిగాయి. మన ఆశ్రమం ప్రచురణగా పంపించిన **"స్వామి శివానంద పిల్లల కథలు"** సభల్లో అవిష్కరించారు. ఇంకా కొన్ని గ్రంథాల్ని వితరణ చేశారు.

వచ్చే 46వ మహాసభలు 2020లో **"కరవది"**లో జరుగుతాయని దివ్యజీవన సంఘం అంతర్జాతీయ కార్యదర్శి **శ్రీశ్రీశ్రీ పద్మానాభనంద సరస్వతీ మహారాజ్** గారు ప్రకటించారు. కార్యక్రమాలు విజయవంతంచేసిన కార్యకర్తలను స్వామీజీ అభినందించారు.

ఇక మన ఆశ్రమంలో గత మాసంలో **శ్రీశ్రీశ్రీ స్వామి సత్యవ్రతానంద మహారాజ్** గారి తృతీయ సమారాధన వార్షికోత్సవాన్ని నిర్వహించుకొన్నాం. ఆశ్రమ వికాసంలో, పత్రికా స్థాపనలో, శివానంద మందిర నిర్మాణంలోనూ, నడపడంలోనూ స్వామివారు చేసిన కృషిని మరోసారి పదిమందికి తెలియజేశాం. రోజూ యోగాలో పాల్గొంటున్న వారికి బహుమతు లందజేశాం. దివ్యాంగులకు వీల్‌చైర్లు వితరణ చేశాం. ఆశ్రమ నిత్యనైమిత్తిక కార్యక్రమంలో పాల్గొంటున్న వారికి, సేవలందిస్తున్న వారికి అభినందనలు తెలుపుకొంటున్నాం.

ధన్యవాదాలతో . . .

**శ్రీ శివానందాశ్రమం**
పద్మారావునగర్, సికింద్రాబాద్
01-03-2019

భవదీయ
**ఆశ్రమ కార్యవర్గం**
**శివానంద భారతి, సంపాదక మండలి**

సంపాదక భారతి

# హిందూస్థాన్ అస్తిత్వం నిలిచేదెలా !?

## (జమ్మూ కాశ్మీర్ పుల్వామా ఘటన దృష్టిలో ఓ ఫైల్ వ్యాసం)

కాశ్మీరులోని ఒక అంగుళం భూమి కూడా వదలం, కాశ్మీరును ఆక్రమిస్తాం, అన్నాడు కొన్నాళ్లక్రితం పాక్‌కు చెందిన బేనజీర్‌భుట్టో కొడుకు. కాశ్మీరులోని తమ ప్రజలు భారత్ ప్రభుత్వంవల్ల బాధలకు గురవుతున్నారని, కాశ్మీరు తమదే అని కార్గిల్ దురాక్రమణకై యత్నించిన మిలిటరీ నేత ముషారఫ్ నిన్న మొన్న అన్నాడు. పాక్ అధినేత నవాబుషరీఫ్ మొన్ననే అంతర్జాతీయ వేదికపై కాశ్మీర్ ప్రస్తావన తెచ్చాడు. ఇక విదేశాల్లోని వారి రాయబారులు నిరంతరం ఏదో ఒకటి అంటూనే ఉంటారు. పాకిస్థాన్ మిలిటరీ అధికారులు కూడా ప్రకటనలు గుప్పిస్తుంటారు. మిలిటెంట్లు వారి నాయకులు కాశ్మీర్లో చొరబడుతూనే ఉంటారు. జమ్మూ కాశ్మీర్లో స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో 35వేల చదరపు మైళ్ల భూ భాగాన్ని ఆక్రమించి దానికి ఆజాద్‌కాశ్మీరు అని పేరుపెట్టి దాని మీద అధికారాన్ని నడుపుతున్నారు. అక్కడ ఉన్న హిందువుల నెందరినో తరిమేశారు, చంపేశారు, వెళ్లలేని వారిని మతం మార్చేశారు.

స్వాతంత్ర్యం వచ్చింతర్వాతనే ఇవన్నీ జరిగాయి. ఇప్పుడింకా జరుగుతూనే ఉన్నాయి. ఆశ్చర్యం! 1990 వరకు కాశ్మీరులోని 256 దేవాలయాలు (చిన్నవి–పెద్దవి) అదృశ్యమై పోయాయి. హిందూ జనాభా తగ్గిన ప్రతి గ్రామంలో ఆలయాలు కూల్చివేయబడ్డాయి ; నామరూపాలు లేకుండా చేయబడ్డాయి. 1980–90 మధ్య కాలంలో పనిగట్టుకొని మరీ ఈ పనిచేయబడింది (చేశారు). కాశ్మీర్లోని ముస్లింలందరు పాకిస్థాన్ మానసపుత్రులుగా మార్చబడ్డారు. కాశ్మీరు లిబరేషన్ ఫ్రంటుపేరిట ఉద్యమాలూ నిర్వహింపబడుతున్నాయి. బ్రిటన్‌లోనూ, అమెరికాలోనూ దానికి అనుబంధ సంస్థలు ఏర్పడ్డాయి. వారు కాశ్మీరు ఆక్రమణకు అనుకూలంగా ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. హిందుస్థాన్లోని ప్రధాన నగరాలలో వారికి సంస్థలూ ఏర్పడ్డాయి. దేశంలో బాంబులు ప్రేల్చడానికి, అస్థిరత్వం సృష్టించడానికి పంచమాంగదళాలు సంసిద్ధమై ఉన్నాయి. హిందువులు కూడా బాంబులు ప్రేల్చి ముస్లింలను హతమారుస్తున్నారని ప్రపంచానికి చెప్పడానికి (చూపించడానికి) తామే,

**మన లోపాలను మనం తెలుసుకోవడం అన్నింటి కన్న పెద్ద చదువు**

ముస్లింలు పలుచగా ఉన్న చోట ఒకరిద్దరు గాయపడే వంటి లేదా ఒకరిద్దరు మరణించేంతటి చిన్న బాంబులు పేల్చి మొగణ్ణి కొట్టి మొగసాలకెక్కే పనులూ చేస్తున్నారు. వ్యూహాత్మకంగా ప్రపంచదేశాల మద్దతు సంపాదిస్తున్నారు. సిరియా, ఇరాక్‌లను ఇస్లామిక్ సామ్రాజ్యానికి కేంద్రంగా మార్చుకోవాలని అన్ని రకాల జిహాదీ సంస్థలు ఐఎస్ ఐఎస్ పేరిట యేర్పడి తమ ప్రయత్నాన్ని రాకెట్ వేగంతో మొదలు పెట్టాయి.

భారతదేశానికి ఇదివరకే ధర్మసత్రమనే పేరుంది. క్రీ.శ. 712 నుండి ఒకటే చొరబడడం! మహ్మద్‌బిన్ కాశిం ఖైబర్ బోలాన్ కనుమలగుండా కాలువెట్టి దోపిడీ మొదలు పెట్టిన కాలం నుండి అఫ్ఘనులు, బానిసలు (గులాంలు), లోడీలు, పఠాన్లు, ఖిల్జీలు, తుగ్లకులు, బహమనీలు, అసఫ్జాహీలు అందరూ దోపిడీగాండ్రే ! దురాక్రమణదారులే !

**"రావణా ! నీవు అధర్మంగా నడుస్తున్నావు అని సీతమ్మ వారంటే, ఓ పిరికి సీతా ! నేను స్వధర్మాన్ని ఆచరిస్తున్నాను, పరరాజ్యాపహరణం, పరధనాపహరణం, పరదారా (భార్యా)పహరణం నా స్వధర్మం ; అదే నేను చేస్తున్నపని. ఇది అధర్మం కాదు ; నా స్వధర్మం" అన్నాడు రావణాసురుడు.**

ఆ లెక్కల్లో వారి స్వధర్మాన్ని వారు ఆచరించారు ; ఆచరిస్తున్నారు. ప్రపంచమంతటా ఇస్లాం రాజ్యాధికారమే నడవాలని ఇవాళ సిరియా ఇరాకుల్లో ప్రపంచ దేశాల ముస్లిమేతర మతస్థుల (ప్రధానంగా క్రైస్తవమతస్థుల) జర్నలిస్టుల తలలు ఖండిస్తూ వీడియో తీసి ఇంటర్నెట్‌లో పెట్టి ఇస్లామిక్ సామ్రాజ్య నిర్మాణాన్ని వ్యతిరేకించే అందరూ ఇలాగే చంపబడతారని (చస్తారని) హెచ్చరికలు చేస్తుంటే, ఈ దేశంలోని రాజకీయ పార్టీలు (శివసేన, భాజపా తప్ప?) అన్నీ ముస్లిం సంతృప్తీకరణ విధానాన్ని పాటిస్తున్నాయి. కాశ్మీరు ప్రత్యేక ప్రతిపత్తికి నెహ్రూ కాంగ్రెస్ తెచ్చిన 370 వ ఆర్టికల్‌లో దేశంలో ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రతిచోటా, ఈ కోరిక పుట్టుకొని వస్తుందన్న సంగతి గుర్తించక, కొత్తగా పుట్టిన తెలంగాణ రాష్ట్ర సమితి అందరికన్నా ముందుకురికి అపీజ్‌మెంటు పాలసీని పరుగెత్తిస్తున్నది. అధికారం కొరకు దేశహితాన్ని పణంగా పెట్టే అంబి–జయచంద్రులు చరిత్రలో దేశద్రోహులుగా నిలిచిపోతారనేది సత్యం కావచ్చుగాక, కాని ఇక్కడ పుట్టి, ఇక్కడ పెరిగి **ఇది నాజన్మభూమి, పుణ్యభూమి, కర్మభూమి, యోగభూమి, తపోభూమి, "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ"** అని భావించే ఈ భూమి పుత్రులేం కావాలి ! వారి దేశ అస్తిత్వాన్ని ఎలా నిలపాలి ! ఎవరు నిలపాలి !

**ప్రపంచంలో నిన్ను కష్టానికి బాధలకు గురిచేసేది ...**

ఇక ముందు ఆటవిక రాజ్యాలే నెలకొనాలా ! తమ మతం కాని వాణ్ణి సర్వనాశనం చేసే మతోన్మాద ఉగ్రవాద రాజ్యాలే నిర్మాణం కావాలా ! హదీస్‌ల బోధను అనుసరించడమే ధ్యేయంగా పెట్టుకొన్న వారిని అగ్రరాజ్యాలైన అమెరికా, చైనా, రష్యా, బ్రిటన్లు ఏమీ అనవా! చస్తే హిందువులే చస్తారు, నష్టం జరిగితే హిందుత్వానికే నష్టం జరుగుతుంది, వారికి పాదాక్రాంతమయ్యేది హిందుస్థానే కాని, తమ స్థానాలు కావు కదా అని నిమ్మకు నీరెత్తినట్టున్న ఇవి అగ్రరాజ్యాలా ! నిహిత స్వార్థ (వెస్టెడ్ ఇంట్రెస్టు) రాజ్యాలా ! ఈ క్రింది హదీస్ బోధనే మతోన్మాద ఉగ్రవాదులు అమలు పరుస్తున్నారన్న సంగతి వీరికెవరికీ తెలియదనుకోవాలా !

**"అల్లా తప్ప మరో దేవుడు లేడని, మహమ్మదు తప్ప మరో ప్రవక్తలేడని ఒప్పుకొనే దాక ప్రజలతో పోరాటం సాగించుమని అల్లా నాకు ఆ దేశం ఇచ్చాడు. ప్రార్థనను ఒప్పుకోవడం, జకాత్ (నీతితో సంపాదించిదైనా, కొల్లగొట్టినదైనా, అయిదవవంతు దేవుని పేర చేసే దానం) చెల్లించడం కూడా జరగాలి. అప్పుడే వాళ్ల ప్రాణాలకు, ఆస్తులకు నా తరఫున రక్షణ లభిస్తుంది (హదీస్–38)".**

ఈ ఆలోచనలకనుగుణంగానే మజ్లిస్ ఇత్తే హాదుల్ ముస్లిమీన్ అనే సంస్థ (రజాకర్ల సంస్థ) హైదరాబాదులో 32 సూత్రాలున్న ఒక ఆచరణ పత్రాన్ని విడుదల చేసింది. ఒకవైపు జాతీయోద్యమం (స్వాతంత్ర్యోద్యమం) జరుగుతుండగా ఏడవ నిజాం మీర్ ఉస్మానలీఖాన్ తాను స్వతంత్రుణ్ణని ప్రకటించుకోడానికి రజాకర్ల ఈ మాగ్నాకార్టానే (శాసనమే) దోహదంచేసింది. అందులోని ఒక సూత్రం (నియమం) చూడండి!

**'జిల్లాల్లోనూ, తాలూకాల్లోనూ హిందువుల ఆస్తులనన్నింటినీ ఆక్రమించుకోవాలి, వాళ్లేమన్నా కయికుయి లాడుతే నొక్కిపారవేయాలి. సహాయం ఏమన్నా అవసరమైతే అంజుమన్ కేంద్రానికి ఎరుకపరుస్తే చాలు, కావలసినంత సహాయం వచ్చిపడుతుంది" (హైదరాబాదుపై పోలీసు చర్య పుట : 123).**

సరిగ్గా అన్నిరకాల జిహాదీసంస్థలతో ఏర్పడ్డ ఐస్ ఈ పద్ధతే పాటిస్తున్నది. భారత్‌లోని ముస్లింలను విధ్వంసం వైపు మళ్ళిస్తున్నది. భారత్‌ను ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నది. అందుకే పాకిస్థాన్ సరిహద్దుల్లో యుద్ధం ప్రారంభించింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో అల్ ఖైదా, జిహాదీ, ఐఎస్, సిమీ, దీన్‌దార్ జైషే మహ్మద్, ఇంకా అవీ ఇవీ పన్నాగం పన్నుతున్నాయి.

**... నీ కోరికలు నీలోని ఆలోచనలే మరెవ్వరో కాదు**

దొంగచాటుగా సముద్రంపై నుండి కసబ్‌లు వస్తారు. బ్యాంకులు లూఠీచేస్తారు. జన సమ్మర్థంలో బాంబులు పేలుస్తారు. దొంగనోట్లతో భారత ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తారు. కేరళలో మల్లపురం జిల్లా మొత్తం వ్యాపించినట్లుగా ప్రతి రాష్ట్రంలో తమ అడ్డాలు నిర్మిస్తారు. లౌజిహాదీ పేరిట మోసాలు చేస్తారు. డబ్బుతో కొంటారు ; ఓట్లతో రాజకీయ పార్టీలనూ, నాయకులను వశంచేసుకొంటారు. ఒక వైపు విధ్వంసాలు, లూఠీలు, హత్యలూ, అత్యాచారాలు, హింసాకార్య కలాపాలు కొనసాగిస్తూనే ఈ దేశంలో మెజార్టీ ప్రజానీకంగా మారడానికి చేయాల్సినవన్నీ చేస్తారు ; వేయాల్సిన ఎత్తుగడలన్నీ వేస్తారు.

ఇప్పుడు చెప్పండి ! 0ఈ భూమిపుత్రులైన హిందువులేంచేస్తున్నారు ! హిందూ సంస్థలేం చేస్తున్నాయి ! ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలేం చేస్తున్నాయి ? ఆయా రాజకీయ పార్టీలేం చేస్తున్నాయి ? ఈ ప్రమాదం నుండి బయటపడి హిందుస్థాన్ అస్తిత్వాన్ని ఎవరు నిలుపుతారో చెప్పండి ! చెప్పండి ! చెప్పండి !!!

**- ఆచార్య కసిరెడ్డి**
**98669 56250**

**మీ భావాన్ని గమనించండి, భావం ఆధారంగా ఆలోచనలు ఉంటాయి. ఆలోచనల ఆధారంగా మాటలు, చేతలు ఉంటాయి, అవే మీ ప్రారబ్ధాన్ని తయారు చేస్తాయి. కావున మీ భావం శుద్ధంగా ఉంటే భవిష్యత్తు బంగారమవుతుంది.**

* * *

**సహాయకరమైన పలుకు పలుకుము. సంతోషకరమైన నవ్వు నవ్వుము. దయాపూరితమైన కార్యము నొనర్చుము. కొద్ది కొద్దిగా సేవ చేయుము.**

కాళ్ళకు చెప్పులు లేవని కలత చెందకు ...

# హిందూ ధర్మ సమగ్ర స్వరూపం
# (ALL ABOUT HINDUISM)

## ఆరో అధ్యాయం

*(గత సంచిక తరువాయి)*

## హిందూ ఆచారాలు

**- శ్రీ స్వామి శివానంద**

### పితృపక్ష ప్రారంభం

యమధర్మరాజు దయవల్ల ఈ ప్రత్యేకసమయంలో జరిపే కర్మలకు అద్వితీయమైన శ్రేష్ఠత ఏర్పడింది. ఈ కాలంలో అర్పించిన నివేదనలన్నీ వారు వారి వంశజులైనా కాకున్నా చనిపోయినవారందరికీ చేరుతాయి. సంతానం లేకుండా మరణించిన వారికి కూడా పితృ పక్ష అమావాస్యనాడు ఇతరులు చేసిన తర్పణాలు చేరుతాయి. అన్నదానం కాని మరే దానాలు కాని చేయకుండా మరణించి పితృలోకంలో ఆనందానికి నోచుకోని వారు ఈ సంస్కారాల వల్ల లబ్ధి పొందుతారు. మరణించిన రోజు తెలియక సంవత్సర శ్రాద్ధం పెట్టడానికి వీలులేని వారికి పితృ పక్షంలో చేసే తర్పణాలు అందుతాయి. బలవన్మరణం పొందినవారికి, ప్రమాదంలో చనిపోయిన వారికి, అసహజమరణం పొందినవారికి మామూలు పద్ధతి ప్రకారం శ్రాద్ధ, తర్పణాలు చేరవు. వారికి కూడా పితృ పక్షంలో అర్పించిన తర్పణాలు నేరుగా చేరుతాయి. యమధర్మరాజు ఇచ్చిన ఈ వరాలన్నీ ఆశ్వీయుజ కృష్ణపక్షంలో కర్ణుడు చేసిన దానాల ఫలితంగా లభించాయి. ప్రస్తుతం హిందువులందరు ఈ పక్షాన్ని ఎంతో నమ్మకంతో శ్రద్ధతో, నియమనిష్ఠలతో, ఆరోజు త్రికాలలో స్నానాలు చేసి, ఉపవాసాలు వుండి పాటిస్తారు. సర్వపితృఅమావాస్య నాడు ఎన్నో దానధర్మాలు చేసి సంపూర్ణకర్మలను నిర్వహిస్తారు.

### దివంగతులైన వారి ఆత్మలను శాంతి పరచడం

హిందువులందరికి మహాలయఅమావాస్య గొప్ప ప్రాధాన్యత వుండే రోజు. ప్రతి సంవత్సరం దివంగతులైన మన పూర్వీకుల ఆత్మలకు శాంతిచేకూర్చడానికి భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేసే రోజు. మహాలయఅమావాస్య రోజు సూర్యచంద్రుల సంయోగం అవుతుందనీ,

**... కాళ్ళులేని వాడిని చూసి కోరికలు కుదించుకో**

సూర్యుడు కన్యారాశిలో ప్రవేశిస్తాడనీ హిందూ ఇతిహాసాలు తెలియజేస్తాయి. ఈ రోజు పితృలోకవాసులు యమలోకాన్ని విడిచి మర్త్యలోకానికి వచ్చి తమ వంశీకుల గృహాల్లో చేరుతారు.

అమావాస్య కన్నా ముందు వచ్చే పక్షంరోజుల్ని చనిపోయిన వారి ఆత్మ శాంతికోసం ప్రత్యేకంగా నిర్ణయించారు. దివంగతులైన పూర్వీకుల కొరకు ఈ పక్షంలో ప్రతిదినం చేసే సంస్కారాలు గయా క్షేత్రంలో చేసిన కర్మలతో సమానం. గతించిన వారిని పూజించడం, వారి కోరికలను తీర్చడం ఈ కర్మలలోని ముఖ్య సూత్రం. ఈ కర్మల నాచరిస్తే పితృదేవతల దయవల్ల సంవత్సరమంతా ప్రశాంతంగా గడుస్తుంది.

## దేవి నవరాత్రులు

ధర్మాచరణకు, సాంప్రదాయక పూజలకు, వ్రతాలకు కొన్ని సమయాలలో ప్రత్యేక ప్రాధాన్యత వుంటుంది. ఇవి దేవతారాధన మాత్రమే కాక పూర్వకాలంలో జరిగిన కొన్ని అద్భుతసంఘటనలను జ్ఞాపకం చేస్తాయి. వీటిలోని నిగూఢరహస్యాలను అర్థం చేసుకొనే ప్రయత్నంచేస్తే కొన్ని దృష్టాంతాలు అగుపడ్తాయి. ఈ దృష్టాంతాలే జీవుడు, ఆత్మానుభూతి పథంలో చేసే పయనానికి ప్రధానమైన సూచికలుగా పనిచేస్తాయి.

స్థూలంగా గమనిస్తే దేవికి తొమ్మిది రోజులు చేసే నవరాత్రి పూజ విజయోత్సవం లాంటిదే. శుంభ, నిశుంభుల లాంటి రాక్షసుల సంహారానికి చేసిన యుద్ధాలలో దేవిసాధించిన విజయపరంపరలను ఈ నవరాత్రులలో దేవికి సమర్పిస్తారు. కాని ఒక సాధకుడి జీవితంలో నవరాత్రులను మూడు భాగాలుగా విభజించి ఆ దేవికి వుండే మూడు అంశలుగా భావించి ఆరాధించడంవల్ల ఎంతో పవిత్రమైన సత్యం ఆవిష్కరణ ఔతుంది. విశ్వం వివిధదశలలో మానవుడు భగవంతుడిగా జీవాత్మ పరమాత్మగా ఎదగడానికి, వికాసానికి ప్రతీకగా ఈ సత్యం నిలుస్తుంది. వ్యక్తిగత స్థాయిలో సాధకుడి ఆధ్యాత్మికసాధనకు దిశానిర్దేశం చేస్తుంది.

పరమాత్మతో నీకు గల శాశ్వతఐక్యతను గుర్తించడమే నీ ఉనికి మూలఉద్దేశ్యం. ఉన్నతమైన సంపూర్ణత్వానికి ప్రతిరూపమే పరమాత్మ. అది మాలిన్యాలులేని స్వచ్ఛత, నిరంజనం. 'దాని' తో నీ ఐక్యతను గుర్తించడం, 'దాని' లో విలీనం కావడం అంటే ఆ దివ్యత్వంలా ఎదగడమే, వికసించడమే. ఈ శరీరానికి అతుక్కుపోయిన అనంతమైన మలినాలను, కాలుష్యాలను, ప్రక్షాళన చేసుకోవడమే తొలిఅడుగు. ఆ తర్వాత అత్యున్నతమైన సద్గుణాలను, పవిత్రమైన దైవీగుణాలను అలవర్చుకోవాలి. స్వచ్ఛమైన దైవీగుణాలతో పరిపూర్ణమైనస్థితిలో నిర్మలమైన నీటికొలనులో ప్రభాత సూర్య కిరణాలలాగ నీలో జ్ఞానం ప్రకాశిస్తుంది.

**ప్రతివాడు మంచి మనిషి ఎవరని వెదుకులాడుతున్నాడే తప్ప, ...**

## దుర్గాదేవి ఆరాధన

**దుర్గుణాలను నిర్మూలన :** దుర్గాపూజ సాధనలో దృఢ సంకల్పం, నిశ్చయాత్మకమైన ప్రయత్నం, కఠినమైన శ్రమ అంతర్లీనమై వుంటాయి. మరో విధంగా చెప్పాలంటే బలం, అనంతమైన శక్తి అతి ప్రధానమైన ఆవశ్యకతలు. ఆ సాధకుడి ద్వారా పనిచేయాలి. బ్రహ్మం, పరమశక్తి అయిన దివ్యమాత ఆ సాధకుడి ద్వారా పనిచేయాలి. మొదటి మూడు రోజులు ఆ 'అమ్మ' ను శక్తి, బలానికి ప్రతిరూపమైన దుర్గాదేవిగా పూజిస్తారు. తమలోని మాలిన్యాలు, దుష్టగుణాలు, లోపాలను నిర్మూలించమని దుర్గామాతను ప్రార్థిస్తారు. సాధకుడిలోని హీనగుణాలతో, అసురగుణాలతో మాత పోరాడవలసి వస్తుంది. నీ సాధనను ప్రమాదాలనుంచి, అవరోధాలనుంచి మాత రక్షిస్తుంది. మొదటి మూడు రోజులు నీలోని మాలిన్యాన్ని నాశనంచేయడానికి, నీ మనస్సులోని చెడువాసనలను నిర్మూలించడానికి శక్తి స్వరూపిణి అయిన దూర్గమాత ఆరాధన జరుగుతుంది.

## లక్ష్మీపూజ

**సద్గుణ సముపార్జన :** దుర్గాదేవి ఆరాధనతో మలినమైన వాసనలు, చెడుస్వభావాలు, పాతఅలవాట్లు లాంటి వ్యతిరేకగుణాలను నిర్మూలించే ప్రయత్నంలో సఫలీకృతుడవు కాగానే నాశనం అయిన ఆ అసురగుణాల స్థానంలో సకారాత్మక గుణాలను, ఆధ్యాత్మికవ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడం నీ తక్షణకర్తవ్యం. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ స్పష్టీకరించిన దైవీసంపదలను ఆర్జించుకోవాలి. జ్ఞానరత్నమనే అపూర్వమైన మణిని, ఆధ్యాత్మిక సంపదను సముపార్జన చేయాలి. శ్రద్ధాసక్తులతో ప్రతిపక్ష భావనను అలవర్చుకునే ప్రయత్నంచేయని పక్షంలో పూర్వపు ఆసురీగుణాలు మళ్ళీ, మళ్ళీ తలెత్తుతాయి. అందుకే సాధకుడి అభ్యాసదశలో పూర్వ దశ ఎంత విలువైనదో, ఈ దశ కూడా అంతే విలక్షణమైంది. తొలిదశ మలిదశల మధ్య ముఖ్యమైన తేడా వుంది. తొలిదశలో మలినమైన, అహంకారపూరిత హీనస్వభావాలను నిరంకుశంగా, నిశ్చయాత్మకబుద్ధితో నిర్మూలన చేస్తే, మలిదశలో క్రమబద్ధంగా, కృత నిశ్చయంతో, దృఢంగా, ప్రశాంతంగా, పవిత్రమైన నిర్మలత్వాన్ని వృద్ధి చేసుకోవడం, మహాలక్ష్మీ ఆరాధన ద్వారా సాధకుడి, సాధనలో వుండే ఆనందమయదశ వ్యక్తీకరణ జరుగుతుంది. మహాలక్ష్మి తన భక్తులకు అనంతమైన దైవీసంపదలను ప్రసాదిస్తుంది. సంపదలను ప్రసాదించే బ్రహ్మస్వరూపమే మహాలక్ష్మి. ఆమె అత్యంతనిర్మలం. రెండవదశలో మూడురోజులపాటు మహాలక్ష్మీ ఆరాధన జరుగుతుంది.

**తాను మంచి మనిషిగా మారడానికి ప్రయత్నం చేయడం లేదు**

## సరస్వతీ ఆరాధన

**పరమ జ్ఞానోదయం :** తనలో వుండే అసురగుణాలను నిర్మూలించి, సత్వ, స్వచ్ఛ, దివ్య గుణాలను అలవర్చుకున్న సాధకుడు, దివ్యజ్ఞానప్రభాతాన్ని దర్శించడానికి, దివ్యజ్ఞాన సముపార్జనకు అర్హత సాధించిన అధికారి అవుతాడు. ఈ దశలో బ్రహ్మజ్ఞానానికి ప్రతిరూపమైన, మూర్తీభవించిన దివ్యజ్ఞానమైన సరస్వతీదేవిని ఆరాధిస్తాడు. ఆమె ధరించిన దివ్య మాణిక్యవీణ అత్యున్నతమైన మహావాక్యాలను, ఆది శబ్దమైన ప్రణవనాదాన్ని జాగృతం చేస్తుంది. సరస్వతీమాత బ్రహ్మానందజ్ఞానాన్ని, తాను ధరించిన ధవళఛ్ఛాయ గలిగిన వస్త్రంలాంటి స్వచ్ఛమైన సంపూర్ణ ఆత్మజ్ఞానాన్ని భక్తుడికి ప్రసాదిస్తుంది. జ్ఞానప్రదాయని అయిన సరస్వతీమాతను పూజించడమే సాధకుని ఆరాధనాకార్యక్రమంలో మూడవదశ.

పదవరోజు విజయదశమి. సరస్వతీదేవి అనుగ్రహంవల్ల దివ్యజ్ఞానం సంపాదించిన జీవుడు, జీవన్ముక్తి పొందిన రోజు, విజయోత్సాహం జరుపుకునే రోజు. పరమసచ్చిదానందస్వరూపంలో జీవుడు విశ్రాంతి పొందుతాడు. విజయసాధనకు, జీవితధ్యేయసాధనకు ప్రతీకగా ఈ విజయదశమి పండుగ జరుపుకుంటారు. విజయ పతాకం వినువీధుల్లో రెపరెపలాడుతుంది. 'నేను', 'అదే'! 'నేను', 'అదే'! చిదానంద రూపః శివో2హం, శివో2హం, చిదానంద రూపః శివో2హం, శివో2హం!

## ఆధ్యాత్మిక విజయాన్నందించే క్రమ పద్ధతి

సాధకుడి ఆధ్యాత్మికప్రగతిలో ఈ సక్రమఆరాధనాపద్ధతికి ఒక ప్రత్యేక స్థానం వుంది. ప్రతి సాధకుడు పయనించే ఆధ్యాత్మికదిశలో వివిధ దశలు అనివార్యాలు. ఒక దశ మరో దశకు దారి తీస్తుంది. ఈ దశలను అతిక్రమించి దగ్గరి దారిలో పయనించే ప్రయత్నం చేస్తే అపజయం తప్పదు. దుష్ఫలితాలు తప్పవు. ఈ రోజుల్లో చాలా మంది సాధకులు తొలిదశలైన స్వచ్ఛత, దైవీసంపదలను పొందకుండానే నేరుగా జ్ఞానంసంపాదించాలని తాపత్రయపడతారు. తాము ఆధ్యాత్మికపథంలో ప్రగతి సాధించలేక పోతున్నామని వాపోతారు. ఇదెలా సాధ్యం? నీలో వుండే మాలిన్యాలన్నిటినీ ప్రక్షాళన చేయి. స్వచ్ఛత, నైర్మల్యం కలిగినపుడే జ్ఞానోదయం కలుగుతుంది. అపవిత్రమైన క్షేత్రంలో సత్యం అనే మొక్క పెరగదు.

**పాముకు పాలు పోసి పెంచినా విషంపోదు - ...**

క్రమమైన ఆరాధనాపద్ధతిని పాటిస్తే శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది. ఇదే నీ మార్గం, ముక్తికి మరోమార్గం లేదు. అసురగుణాల నన్నింటినీ నిర్మూలించి సద్గుణాలను అలవర్చుకో. ఈ సత్క్రమసాధనవల్ల నీ జీవితధ్యేయమైన బ్రహ్మంతో ఐక్యతపొందే సంపూర్ణత్వం నీలో తేజరిల్లుతుంది. అప్పుడే సంపూర్ణజ్ఞానం కలిగి సర్వజ్ఞుడిగా, సర్వశక్తి మంతుడిగా మారి సర్వవ్యాపకత్వాన్ని అనుభవిస్తావు. అంతటా నీవే వ్యాపించి వున్న భావన కలుగుతుంది. నీవు జీవన్ముక్తుడివి అవుతావు. జననమరణచక్రం నుంచి విముక్తి లభిస్తుంది. సంసారమనే రాక్షసుడిపై విజయం సాధిస్తావు. బాధ వుండదు, దుఃఖం వుండదు, జన్మవుండదు, మరణం వుండదు. నీదే విజయం!

దివ్యమాతకు జేజేలు! నిన్ను ఒక్కొక్క మెట్టు పైకి లేవనెత్తుతూ ఆధ్యాత్మిక శిఖరాగ్రానికి చేర్చి పరబ్రహ్మంతో ఏకం చేయాలిగాక!

*(సశేషం)*

## వాస్తవమైన యోగం

**ఆరుగంటల పాటు కాళ్లు ముడుచుకొని కూర్చోవడం కాని హృదయ స్పందనలను ఆపడంకాని వారం లేదా నెలపాటు భూమిలో వుండడం యోగం కాదు.**

**ఇవన్నీ శారీరక ప్రక్రియలే.**

**ఒక వ్యక్తి తన చిత్తాన్ని విశాలవిశ్వం యొక్క చిత్తంతో అనుసంధానంచేసే ప్రక్రియను నేర్పే శాస్త్రమే యోగం. పరాక్రమం, సజీవత్వాన్ని పెంచే శాస్త్రమే యోగం. ధారణశక్తిని, ధ్యానశక్తిని పెంచే శాస్త్రమే యోగం.**

**... వేప చెట్టుకు తేనె పోసి పెంచినా చేదుపోదు**

# భావ పరిణతి

## మనస్సు - సమత్వం

మూలం : స్వామి దయానంద సరస్వతి

సేకరణ : స్వామి సర్వవిదానంద

*(గత సంచిక తరువాయి)*

"ఎందుచేత?" అనడిగాను.

"ఎందుచేత నంటే నా పుత్రులు నన్ను పట్టించుకోరు"

"వారు పట్టించుకోరనెలా చెప్పగలవు?"

"ఎందుకంటే వారు ఉత్తరాలు వ్రాయరు. వ్రాసిన వాటికి జవాబివ్వరు".

కానీ అతడికొడుకు లతడి గురించి శ్రద్ధ వహిస్తారు. తరచుగా ఉత్తరాలు మటుకు వ్రాయరు. అందుకు కారణం వారతిగా వ్యస్తులై ఉండవచ్చు. లేదా వారి సమస్యలు వారికుండవచ్చు. లేదా వ్రాయటం వాయిదా వేసి, తరువాత, సమాధానమివ్వటానికి చాలా ఆలస్యమైందని వదిలివేయవచ్చు. అసలు వారు వ్రాయకుండా ఉండటం మంచిదే. ఒక నిజమైన హిందువుగా ఈపాటికతడు సన్యసించి ఉండాలి. సన్యాసము ఉత్తమమైన విరమణ పథకం. ఎందుచేతనంటే సన్యాసి కేమీ అవసరం లేదు. దీక్షాస్వీకారం చేసి ఎవరూ సన్యాసి కానక్కరలేదు. కానీ ఆ పరిణతి ఉండాలి. సమస్యేమిటంటే ఏడుపదుల వయసు దాటినా, తనకి భద్రత లేదని భావిస్తారు.

నీవు చిన్నపిల్లవానిగా ఉన్నప్పుడు నీ అమ్మనాన్నలు నీ జాగ్రత్తలు తీసుకోవాలనను కున్నప్పుడు నీవు భద్రత లేని వాడివి. వాళ్ళు నిన్నొదిలి వెళ్ళిపోతే ఒంటరి వాడినై పోయానని బాధపడ్డావు. మరి ఇప్పుడు, ఇన్ని సంవత్సరములు గడచిన తరువాత, తాతవైన తరువాత కూడా భద్రత లేని వానిగానే ఉండిపోయావు. నీవు సాధించిన దేమిటి? అంతరంగంలో ఎదగకపోతే వ్యక్తికి ఎదుగుదల ఉండదు. నీవప్రమత్తంగా ఉండకపోతే – జాగరూకత వహించకపోతే అది జరగదు.

**నీవ్వా ప్రేమించే దాన్ని విశ్వసించు. నీవ్వ విశ్వసించే దాన్ని ప్రేమించు. ...**

## కర్మ యోగివి కా

ఇంతకుముందు నేను చెప్పినట్లుగా, ప్రతివారు ఒక రాగద్వేషముల మూట. అవి సాధించాలని సహజంగానే కోరుకుంటారు. కనుక ఒక రాగాన్ని గాని, ద్వేషాన్ని గాని సాధించటం కోసం కర్మ చేపడతారు. వచ్చే కర్మ ఫలం క్రింద చెప్పిన నాలుగింటిలో ఏదో ఒక రూపంలో ఉంటుంది.

**1) ఫలితం నీవాశించిన దానికనుగుణంగానే ఉంటుంది.**

**2) ఆశించిన దానికంటే అధికంగా లభించవచ్చు.**

**3) ఆశించిన దానికంటే తక్కువ లభించవచ్చు.**

**4) ఆశించిన దానికంటే పూర్తిగా విరుద్ధ ఫలం కావచ్చు.**

**నీకు కడుపు నొప్పి వచ్చిందనుకుందాం. మందు తీసుకున్నావు. ఫలితం క్రింది విధంగా ఉండవచ్చు.**

**1) కడుపు నొప్పి తొలగి పోవచ్చు.**

**2) ఆ మందు కడుపు నొప్పి పోగొట్టడమే కాకుండా, మోకాటి నొప్పిని గూడ తొలగించవచ్చు.**

**3) నొప్పి కొంత తగ్గవచ్చు. పూర్తిగా పోక పోవచ్చు.**

**4) ఆ మందు నీ శరీరానికి సరి పడక నీ ఉదర వ్యాధి తీవ్ర వ్యాధిగా పరిణమించవచ్చు.**

**ఆ విధంగా ఏ కర్మకైనా ఫలితం నాలుగు రకాలుగా ఉండే అవకాశం ఉంది.**

ఒక కర్మ చేపట్టినప్పుడు ఈ నాలుగు ఫలితాలలో దేనికైనా సిద్ధపడాలా, వద్దా ? సిద్ధపడటమే మంచిది. సిద్ధ పడక పోవటం అపరిపక్వత అవుతుంది. రహదారి దాటటం లాంటి చిన్న పని కూడా ఈ నాలుగింటిలో ఏ ఫలితాలైనా ఇవ్వవచ్చు. – ఆశించినట్లుగా రోడ్డు దాటవచ్చు. లేదా క్షేమంగా రహదారి దాటడమే కాక, ఎంతో కాలంగా కలవాలనుకుంటున్న వ్యక్తి ఆవలివైపున నీకు తారసపడవచ్చు. వాహనాల మధ్యలో ఇరుక్కుపోయి ఎంతో కష్టం మీద బయటపడవచ్చు. లేదా అకస్మాత్తుగా ఎక్కడినుండో (అన్నట్లుగా) ఒక కారు దూసుకువచ్చి నిన్ను ఢీ కొనవచ్చు, చివరకు నీవు ఆసుపత్రి పాలుగావచ్చు.

**... అప్పుడే జీవితం మూడు పూవ్వులు ఆరుకాయలు**

మనం సర్వజ్ఞులము కాము. సర్వశక్తిమంతులు కాము. మన జ్ఞానము, శక్తి రెండు పరిమితములే. మనకు ప్రతీది తెలిస్తే దుర్ఘటనలన్నీ తప్పించి కావాలనుకుంటున్నదల్లా సాధించగలం. జ్ఞానలేమి వల్లనే మనం కోరుకున్నదల్లా సాధించలేము. ఒక్కొక్కప్పుడు జ్ఞానమున్నప్పటికి, పూర్తి శక్తిసామర్థ్యాలు మనచేతుల్లో ఉండవు కనుక కోరుకున్నవి సాధించలేము. చెట్టుపై నుండొకతను క్రిందపడుతున్నాడనుకుందాం. దెబ్బ తగలుతుందని అతడికి తెలుసు. ఐనా తప్పించుకోలేడు. ఆ విధంగా జ్ఞాన లోపం వలన, సామర్థ్య లేమివలన మనమనుకున్నదల్లా సాధించలేము. ఐనప్పటికి, ఈ రాగద్వేషములను సాధించాలనుకుంటాం. అందుకోసం నానా రాకాల పనులు చేపడతాం. ఆ కర్మలు ఈ నాలుగింటిలో ఏ ఫలితాన్నైనా కలిగించవచ్చు. దాన్నే విధంగా స్వీకరించబోతున్నాం? కృష్ణభగవానుడు బోధిస్తున్నాడు. – కర్మయోగివి కా.

భగవద్గీతలో భగవానుడు కర్మయోగానికి రెండు నిర్వచనాలు చెప్తాడు. –

**"సమత్వం యోగ ఉచ్యతే"**

**"సమత్వం యోగ మనబడుతుంది".** (భ.గీ. 2-48)

**"యోగః కర్మసు కౌశలమ్"**

**"కర్మ దృష్ట్యా కౌశలమే యోగము".** (భ.గీ. 2-50)

ఈ రెండు నిర్వచనములను మనమర్థం చేసుకోవాలి.

## ఫలితముల పట్ల సమత్వం

మొదట సమత్వం తీసుకుందాం. సమత్వమే యోగము. అసలు సమత్వమంటే ఏమిటి? కర్మపరంగా సమత్వముండే అవకాశముందా ? లేదు. ఎందుకంటే ప్రతి కర్మ మరో కర్మ కంటే భిన్నం. కూర్చోవటం, నిలుచోవటం కంటే భిన్నం, అది పరుగెత్తటం కంటె భిన్నం. భగవానునికి కూడా సృష్టించటమొక కర్మ, స్థితి మరో కర్మ, లయం చేయటం మింకొక కర్మ. కోరికలలో సమత్వం ఉండజాలదు. ఎందుకంటే ఒక ఫలాన్నాశించి కర్మ చేయటం జరుగుతుంది. భిన్న భిన్న ఫలములు పొందటం కోసం నేను భిన్న భిన్న కర్మలాచరిస్తుంటాను. ఫలములలో సమత్యముంటుందా ? కర్మలు భిన్నం కాబట్టి ఫలములు కూడ భిన్నంగానే ఉంటాయి. అంతేగాక, ఒకే కర్మకు కూడా భిన్న సమయాలలో భిన్న ఫలితాలుంటాయి. మరి

**మంచి ప్రవర్తనకు డబ్బు విలువ ఉండకపోవచ్చు కానీ, ...**

సమత్వం ఏ విషయంలో ఉండే అవకాశముంటుంది? కర్మ ఫలములపట్ల భావనలో మాత్రమే సమత్వముండే అవకాశమున్నది.

**"నిత్యంచ సమచిత్తత్త్వం ఇష్టానిష్టోపపత్తిషు"**
**"ఇష్ట ఫలముల పట్ల అనిష్ట ఫలముల పట్ల సమచిత్తత్వము కలిగి ఉండటం".**

– (భ.గీ. 13–9)

నే నాశించిన దాని కనుగుణంగానో అధికంగానో ఉంటే ఆ ఫలితాన్నిష్టఫలమంటారు. ఆశించిన దానికంటె అల్పంగానో విరుద్ధంగానో ఉంటే దాని ననిష్టఫలమంటారు. ఇష్టఫలముల పట్ల అనిష్ట ఫలముల పట్ల సమత్వబుద్ధి కలిగి ఉండటాన్ని యోగమంటారు. దాన్నే నేను భావపరిణతి అనంటాను. కాబట్టి కర్మయోగిగా ఉండటంలో ప్రత్యేకతేమీ లేదు. ప్రతి వారి నుండి అది ఆశించబడుతున్నది. ఒకరు జన్మించినపుడు భౌతికంగా పెరగాలి. భావపరంగా కూడా పరిణతి పొందాలి. జీవన విధానంలో అంతర్భాగమది. కనుక కర్మపలంపట్ల సమచిత్తత్త్వాన్ని యోగమంటారు.

ఈ ప్రసిద్ధ శ్లోకంలో భగవానుడు జీవితం పట్ల ఎటువంటి భావన ఉండాలన్నది వివరిస్తాడు. –

**"కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన, మా కర్మఫల హేతు ర్భూః మాతే2సంగోస్త్వ కర్మణి"**
"కర్మనెంచుకోవటంలో మాత్రమే నీకధికారమున్నది గాని వాటి ఫలముల విషయంలో ఎంతమాత్రమూ లేదు. కర్మఫలానికి కారకుడవు కాకు. అకర్మ యందు నీకు సంగముండకుండు గాక".

***(సశేషం)***

**శ్లో॥ జామాతా, జఠరం, జాయా, జాతవేదా, జలాశయా ।**
**పూరేనైవన పూర్యన్తే జకారా పంచ దుర్లభా ॥**

భా॥ లోకంలో ఐదు 'జ' కారాలు, వాటికి ఎంత చేసినా తృప్తి ఉండదు. అవి 1) జామాతా – అంటే అల్లుడు 2) జఠరం – కడుపు నిండా ఎంతతిన్నా మరునాటికి మామూలే 3) జాయా అంటే భార్య – ఎన్ని చీరలు నగలు ఇచ్చిన కావాలని అంటారు 4) జాతవేదా – అగ్ని ఏమి ఇచ్చినా ఎన్నింటిని ఇచ్చినా భస్మం చేస్తుంది 5) జలాశయా– ఎంత నీరు పొందినా ఇంకా కావాలంటుంది. ఈ ఐదు జకారాలను తృప్తిపరచటం కష్టం. మరి తృప్తిగా జీవించాలంటే యోగం, ధర్మం, నీతి అవసరం.

**... కొన్ని లక్షల హృదయాలను కొనగలిగిన శక్తి ఉంటుంది**

# శ్రీ రమణతత్త్వము

*(గత సంచిక తరువాయి)*

- శ్రీమతి బొప్పన అరుణాదేవి

## ఈశ్వర సాక్షాత్కారము సాధ్యమా ?

గాఢనిద్రలో మనస్సు లయం అవుతుంది గాని నాశం గాదు. లయం అయినది మళ్ళీ పొడసూపుతుంది. ధ్యానంలో కూడా అది సంభవమే. యోగి లక్ష్యం మనోనాశమే గాని మనోలయం కాదు. ధ్యానం కూర్చే ప్రశాంతిలో మనస్సు లయం కావచ్చు. కాని అంతమాత్రం చాలదు. ఎంతో అనుష్ఠానం చేస్తే తప్ప మనోనాశం కాదు. మనస్సును ఆత్మకు భిన్నంగా గుర్తింపకపోవటమే దాన్ని నాశం చేయటం. మనోనాశనం చేసే విధానమిదే.

కష్టిస్తున్నది, కర్మలనాచరిస్తున్నది నీవని ఎందుకనుకొంటున్నావు. రైలులో ఎక్కిప్రయాణం చేస్తావనుకో నీవు ఉన్నట్లే ఉన్నావు. కదిలింది రైలు. నీవే ప్రయాణం చేసావన్నది నీ భ్రాంతి. అటువంటిదే నీ పనులన్నీ. అవి నీవొనర్చినవి కావు. అవన్నీ దైవమొనర్చేవి.

నిత్యమూ, అఖండమూ అయిన ఆనందంలో స్థిరంగా ఉండటమే గురువుకు శిష్యుడిచ్చే గురుదక్షిణ. ఆ స్థితి నుండి ఎన్నడూ దిగజారకుండుట. శ్రవణం రెండు విధాలుగా ఉంది. పెద్దలు ప్రతిపాదించిన దానిని వివరించి చెపుతుంటే వినటం. ఇది సర్వసామాన్యం. కాని తన్నుతానే ప్రశ్నిస్తూ, శోధించి, సమాధానం తనలోనే అవిరళమైన అహం స్ఫురణగా కనుగొనటం సరియైన మార్గం.

సంస్కారాలు వ్యక్తి చనిపోయినప్పుడు, హృదయంలో లయమవుతాయి, అవి నష్టము కావు. సరియైన కాలానికి అవి హృదయం నుండి తిరిగి మొలకెత్తుతాయి జీవుని పునర్జన్మ రీతి యిది.

సమాధి స్థితి మనస్సుకు, వాక్కుకు అందదు. అందువల్ల వర్ణింపలేనిది, గాఢనిద్ర నెవరైనా వర్ణింపగలరా ? సమాధిస్థితిని వర్ణించటం మరీ కష్టం. సమాధిస్థితి పొందినవాడికి అది అనుభవముతుంది.

ఆత్మజ్ఞానానికి, లోకజ్ఞానికి సామరస్యం ఉండాలి. అవి రెండూ సమానంగానే అభివృద్ధి చెందాలి.

**సమస్య లేకపోతే జీవితంలో కొత్తదనమే లేదు - మీరు ఎప్పుడూ ...**

జీవుడు కర్మబద్ధుడు ఎప్పుడవుతాడంటే.. కర్తవైనంత వరకు భోక్తవు కూడా కావలసిందే. కర్తవు నీవు కావని గ్రహించిన మరుక్షణం ముక్తుడవవుతావు. దీనికి దైవానుగ్రహము కావలసిందే. అందులకై దైవమును ప్రార్థించాలి, పూజించాలి, ధ్యానించాలి. నీ ప్రయత్నం లేకుండానే జరిగే కర్మ ఆయత్నకర్మ, అది నిన్ను బంధించదు. దేహం కదలిక వల్ల, జ్ఞాని సైతం ఏవేవో ఆచరిస్తున్నట్లుగా కనబడుతుంది. సంకల్పమూ, యత్నమూ లేక కర్మ ఉండదు. అందరికి సంకల్పాలు ఉన్నాయి. అయితే బంధహేతువులయిన వాటిని మాని, ముక్తి హేతువులయిన కర్మలను ఆచరించాలి.

అహంకరణ నశించిన వెంటనే మౌనం తానుగా పుడుతుంది. ఆ స్థితి వెలుగు, చీకట్లకు ఆవలిది.

అడవిలో రాముడు ఋషులలో ఋషి వలె ఉన్నాడు. ఋషిపత్నులు సీతను వీరిలో నీ పతి ఎవరని ప్రశ్నించారు. వారు ఆ ఋషులను ఒక్కొక్కరినే చూపగా సీత 'కాదు' 'కాదు' అని చెప్పింది. చివరికి రాముడ్ని చూపగా మౌనంగా తలదించుకుంది. ఆ రీతిగానే 'నేతి' 'నేతి' అని ఘోషించిన వేదాలు ఉన్నట్లుండి మూగవైనవి. ఆ మౌనమే సత్యస్థితి. అహం స్ఫురణ మూలం చేరగానే తలపులన్ని మాయమవుతాయి. మిగిలినదే ఆత్మ.

ఒక మారు కలిగిన జ్ఞానం స్థిరం కావటానికి కొంతకాలం పడుతుంది. ఆత్మ ప్రతివానికీ స్వంత అనుభవమే. మంత్రోచ్చాటనాదులు అగ్నివలే అప్పటికి కాల్చకపోయినా, ఆ తర్వాత దహించివేస్తుంది. ఆ విధంగానే వాసనల వలన ఆత్మ అణగియుండినా, అవి క్షయించగానే ప్రకాశమానం అవుతుంది. వాసనల ఎదుగుపొదుగుల వల్ల జ్ఞానం నిలద్రొక్కుకోవటానికి వ్యవధి కావాలి. సద్గురు సన్నిధిలో వాసనలు చచ్చుపడి, మనస్సు స్తబ్ధమై, సమాధి సిద్ధిస్తుంది. సద్గురుని సన్నిధిలో శిష్యునికి సద్విద్య, సమ్యగనుభవాలు కలుగుతాయి. అంటే ప్రతిష్ఠితుడు కావడానికి, ఇంకా అధికంగా యత్నం కావాలి. కర్మల వలన సమాధి స్థితి జారిపోతుంది అనే భయం అజ్ఞాన లక్షణం. సమాధిస్థితి సహజ జీవితం కావాలి. మన ప్రయత్నాలకు, ప్రయత్న రాహిత్యానికి ఆవలి స్థితి ఒకటి ఉంది. దాన్ని చేరేవరకు సాధకుడు ప్రయత్నం సాగించాలి. పరమశాంతి, ఆనందాన్ని ఒకసారి అనుభవించాక, దానికి దూరంగా ఉండలేడు. తలపులను నిరోధించటం అజ్ఞానికి ఎంత కష్టమో, తలపులను పెంచటం జ్ఞానికి అంతే కష్టం. ఎట్టి కర్మలయినా జ్ఞానికి అంటవు. వాని మనస్సెప్పుడూ పరమశాంతిలో నిమగ్నమై ఉంటుంది. తలపులను తుడిచవేయటానికి కావలసింది ఏకాంతం కాదు. అభ్యాసం.

ఒకే స్థానమందు మనస్సును లగ్నం చేస్తే, దానిలో మగ్నుడవుతాడు. ఆ మజ్జనమే తన్మయావస్థ. ఇతరములన్ని మటిగిపోయి ఆత్మ ఒక్కటే మిగులుతుంది. కర్మయోగి, భక్తుడు కూడా తన్మయావస్థను పొందుతారు.

**... ఓడిపోలేదంటే మీరెప్పుడూ కొత్తగా ప్రయత్నించలేదని అర్థం**

భగవాన్ అంటారు 'స్మృతులేవేవో తెల్పినాయి. అవన్ని ఈ రోజుల కనురూపం గావు. మేము ప్రపంచాన్ని మరమ్మత్తు చేస్తాం, స్మృతులను తిరగవ్రాస్తామని ఆర్భాటాలు, చిందులూ త్రొక్కినవారు చిరంతనంగా వస్తూనే వున్నారు. ఆ సంస్కర్తలు వచ్చారు, వెళ్ళిపోయారు. కాని స్మృతులు మాత్రం స్థిరంగానే ఉన్నవి. వ్యర్థవాదాలతో కాలం వెళ్ళపుచ్చక ఎవరి వచ్చిన పనివారు చూచుకొంటే అంతా సరిగా ఉంటాయి'.

ఈశ్వర సృష్టికి ఉపకరించగలనా? అని అడిగిన వాడితో భగవాన్ అంటారు 'సృష్టిలోని ఈశ్వరాంశకు నీ 'ఆత్మ' భిన్నమా? నీకు నీవు సాయపడలేవు. ప్రపంచానికి సాయపడతానవంటావు. కాని దానికై నీకు మళ్ళీ ఈశ్వరాంశే సాయపడాలి కదా ! అదే వింత. నిన్న శాసిస్తున్నది, నడుపుతున్నదీ ఈశ్వరాంశే. నిద్రలో నీవెక్కడికి పోయావు? ఎక్కడి నుండి మరలి వస్తున్నావు? అందరిలోనూ ద్రష్ట ఒక్కడే. వ్యక్తులు అనేకులు గావచ్చు. నానాత్వము నిద్రలో కనిపిస్తోందా !

**గంగా స్నానంవలన ప్రయోజనముందా ? అంటే గంగ నీలోనే ఉంది. ఈ గంగ నిన్ను చలిలో వణికించదు. దానిలో మునుగు అంటున్నారు భగవాన్. గీత, బైబిల్ రెండూ వేరు కావు అంటారు. మానవుడు పాపసంభవుడు అని బైబిల్ అంటుంది కదా అన్న సందేహానికి 'పాపమే మనిషి, నిద్రలో మనుష్యత్వము లేదు. పాపమన్న తలపులకు మూలము దేహభావన. అసలు తలపుల పుట్టుకే పాపము' బైబిల్‌లో ఆత్మ నష్టమౌతుందన్నారు అన్న సందేహానికి 'అహమన్న తలపు, అహంకరణము. నష్టమయ్యేది అది. నిజమైన 'నేను' బైబిల్‌లోని 'నేనదే నేను'.**

'శక్తి అన్నది నీలోనే ఉన్నది. వెలుపల కాదు. శ్రీరామకృష్ణులు వివేకానందునిలో ఉండినారు. వివేకానందుని దేహమాత్రుడనుకుంటే రామకృష్ణుడు దేహమాత్రులే అవుతారు. కాని వారు దేహమాత్రులు గారు. శ్రీరామకృష్ణుడే వివేకానందుని ఆంతర్యంలో లేకుంటే, వారు సమాధి నిష్ఠులయ్యేవారే గాదు' అంటారు భగవాన్.

అద్వైత, విశిష్టాద్వైతాల గురించి భగవాన్ ఇలా అంటారు. 'అద్వైతులు సర్వమూ బ్రహ్మమంటారు. విశిష్టాద్వైతులు బ్రహ్మము సర్వంలోనూ సగుణుడు అంటారు. శ్రీ ఆచార్యులవారు 'జగత్తు మూలమేదో చూడు' అన్నారు అంతే. ఒకరు 'మాయ' అంటే, దాన్నే మరొకరు 'మార్పు' అంటారు. చివరికి ఇద్దరి గమ్యమూ ఒక్కటే కదా !

*(సశేషం)*

**నిన్ను ఎంతమంది అణగదొక్కాలని చూసినా బెదిరికపోకు. ...**

# ధ్యానం - ఓ విహంగ వీక్షణం

**ఆంగ్లమూలం - స్వామి శివానంద** **- తిప్పరాజు కొండల్‌రావు**

*(గత సంచిక తరువాయి)*

## ధ్యానంలో అపజయానికి కారణాలు

సాధారణంగా నూతన సాధకులు తమ వ్యధను ఈవిధంగా వ్యక్తం చేస్తుంటారు. "నేను గత పన్నెండు సంవత్సరాలుగా సాధన చేస్తున్నాను. ఎలాంటి పురోగతి సాధించలేదు. సాక్షాత్కారం కలుగలేదు". ఇలా ఎందుకు జరుగుతుంది? దీనికి కారణం ఏమిటి? వారు తమ హృదయాంతరాళలోనికి చొచ్చుకొనిపోయి దీర్ఘ ధ్యానం చేయలేదు. వారు తమ మనస్సును భగవదాలోచనలతో సంపూర్తిగా నింపలేదు. వారు సక్రమంగా శ్రద్ధతో సాధన చేయలేదు. వారు తమ ఇంద్రియాలను పూర్తిగా నియంత్రించలేదు. తమ మనస్సు నుండి ప్రసరించే బహిర్ముఖ కారణాలను నియంత్రించలేదు. వారు "ఈ క్షణమే ఆత్మ సాక్షాత్కారం సాధిస్తాను" అని దృఢ నిశ్చయం చేసుకోలేదు. వారు నూటికి నూరు పాళ్ళు తమ మనస్సును భగవంతునికి అర్పణ చేయలేదు.

**ఒక ధ్యాని పదినిముషాలపాటు దివ్యాలోచనలు కలిగివుండి, మరో పది నిముషాలపాటు విరుద్ధమైన లౌకిక ఆలోచనలు కలిగి వుంటే వారు దివ్యచైతన్యాన్ని సాధించలేరు. వారు ఒకే బిందువు వైపు దృఢంగా, శక్తివంతంగా, బలంగా పరిగెత్తాలి. అన్ని సమయాల్లో దైవచింతన కలిగి ఉండాలి. అప్పుడే భగవంతుణ్ణి పొందడం సాధ్యమౌతుంది.**

ధ్యానానికి పూనుకొనగానే తగిన ఫలాలు పొందాలని తొందరపడవద్దు. ఒక వనిత సంతానపేక్షతో అశ్వత్థ వృక్షానికి నూట ఎనిమిది మార్లు ప్రదక్షణచేసి తన కడుపులో సంతానం వుందా అని తన కడుపును తడిమి చూచిందట. ఇది అత్యంత మూర్ఖమైన భావన. ఆమె కొన్ని మాసాలపాటు వేచి వుండాలి. అదేవిధంగా మీరు కొంతకాలం సక్రమంగా ధ్యానం అభ్యసిస్తే మనస్సు వికసించి, పక్వంచెంది కొంత కాలం తర్వాత ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది. తొందర పడడంవల్ల లాభం లేదు.

**... ఒక్కసారి నీవు బెదరిపోయావంటే వంచిన తలని పైకి ఎత్తలేవు**

# ధ్యానంలో కలిగే అనుభవాలు

ధ్యానంలో వివిధ రకాల వ్యక్తులకు వివిధ రకాల అనుభవాలు ఎదురౌతాయి. అందరికీ ఒకే విధమైన అనుభవం కలుగదు. ఆ అనుభవం వారి వారి స్వభావంపై, వారి సాధనా విధానంపై, వారు ధారణ చేసే విషయంపై ఇతర విషయాలపై ఆధారపడి వుంటుంది. కొందరు తమ చెవులలో శ్రావ్యమైన ధ్వనులను వింటారు. కొందరు ప్రకాశాన్ని చూస్తారు. కొందరు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతారు. కొందరు ప్రకాశాన్ని, ఆనందాన్ని రెండింటినీ అనుభవిస్తారు. ధ్యానం చేస్తున్నప్పుడు కొందరు తమ ఆసనం నుండి పైకి లేస్తున్నట్లు, కొందరు గాలిలో తేలి పోతునట్లు అనుభవం పొందుతారు.

మీరు ధ్యానం చేస్తున్నప్పుడు మీ జీవాత్మ ప్రత్యక్షమైనా, కనులు మిరుమిట్లుగొలిపే ప్రకాశం కనిపించినా, ఋషులు, మునులు, దేవతలు, దివ్యమూర్తులు దర్శనమిచ్చినా, ఇంకా వైవిధ్యంగల ఆధ్యాత్మిక అనుభవాలు కలిగినా భయపడకండి. అవి దుష్టశక్తులని భావించకండి. సాధన ఆపివేయకండి. ప్రయత్నం చేస్తూ వుండండి. పట్టుదలతో ముందుకు సాగండి. ముసుగు తర్వాత ముసుగును తొలగిస్తూపోండి.

సాధకులు ఆధ్యాత్మిక అనుభవాలు కలగాలని తొందర పడుతూ ఉంటారు. తీరా అవి కలిగిన తర్వాత భయపడతారు. వారు తమ శారీరక చైతన్యానికి అతీతంగా వెళ్ళగానే గాబరాపడిపోతారు. వారు తమ మామూలు స్థితికి చేరతామో లేదో అని ఆశ్చర్యపడుతూ ఉంటారు. వారు తిరిగి శారీరక చైతన్య దశకు తిరిగి రావడమనేది అంత ప్రధానమైన విషయం కాదు. మన ప్రయత్నాలన్నీ ఆ దశకు అతీతంగా చేరడానికే. మనం కొన్ని పరిమితులకు అలవాటుపడి వున్నాము. ఆ పరిమితుల నుండి జారిపోగానే మనం నిలబడే ఆధారం కోల్పోయినట్లు భావిస్తాము. శారీరక దశకు అతీతంగా వెళ్ళగానే భయపడడానికి ఇదే కారణం. ఇదో ప్రత్యేకమైన అనుభవం. ఇలాంటి పరిస్థితుల్లో ధైర్యం చాలా అవసరం.

కొన్ని సమయాల్లో దుష్టశక్తులు భయపెడుతూ ఉంటాయి. వాటి ముఖాలు భయంకరంగా ఉండవచ్చు. పెద్ద పెద్ద కోరలు కలిగి ఉండవచ్చు. దృఢ సంకల్పంతో వాటిని పారద్రోలండి. అవి దుష్ట శక్తులు. అయినా సాధకులకు ఎలాంటి ప్రమాదం కలిగించవు. ఇది మీ ధైర్యానికి పరీక్ష. మీరు పిరికి వారైతే ముందుకు సాగలేరు. మీ అంతరాత్మ నుండి శక్తిని, ధైర్యాన్ని పుంజుకోండి. అందులో అనంతమైన శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. ఒకోసారి మంచి శక్తులు

**ఎవరితోనైనా ఎంతవరకుండాలో అంతవరకే ఉండాలి. ...**

కూడా తారసపడవచ్చు. అవి మీ పురోగతికి సహకరిస్తాయి. ధ్యానం చేస్తున్న సమయంలో కొన్ని దృశ్యాలు మీ మనోకల్పితాలు, రూపం ధరించిన మీ ఆలోచనలు, మరికొన్ని వాస్తవమైన దృశ్యాలు.

మీ ఆరోగ్యం బాగుంటే మీరు శారీరకంగా, మానసికంగా సంతోషంగా, దృఢంగా, ఆనందంగా ఉంటే మీ మనస్సు చంచలంగా కాకుండా ప్రశాంతంగా ఉంటే ధ్యానంలో మీకు ఆనందం కలుగుతూ ఉంటే, మీరు స్వచ్ఛంగా, బలంగా, దృఢంగా, బలవంతులై ఉంటే – మీరు ధ్యానసాధనలో పురోగతి సాధిస్తున్నారనీ, అంతా సవ్యంగా ఉందనీ భావించండి.

## ధ్యానంలో నిత్య కార్యక్రమాలు

ధ్యానం చేసేవాడు పని చేయలేడు, పనిచేసే వాడు ధ్యానం చేయలేడు. ఇది సమతుల్యత కాదు, సమభావం కాదు. ధ్యానం, పని అన్న రెండు సిద్ధాంతాలు సమతుల్యంగా ఉండాలి. మీరు భగవంతుని ఆదేశాలను పాలన చేయడానికి సిద్ధంగా ఉంటే మీకు నిర్దేశించి పని – ఎంత కష్టతరమైనదైనా సరే – సమర్థవంతంగా నిర్వహించాలి. మరుసటి రోజు, పనిని బాధ్యతాయుతంగా నిర్వహించానన్న భావనతో జీవించాలి. పనికి ముందు ఎంత ప్రశాంతంగా ఉన్నారో పని నెరవేర్చిన తర్వాత కూడా అంతే ప్రశాంతంగా ఉండాలి. ఈ లోకంలో అపారమైన శక్తి సామర్థ్యాలతో పనిచేయాలి. పనిపూర్తి అయిన తర్వాత ఏకాంత ప్రదేశంలో చాలా సమయం వరకు మౌనంగా, ప్రశాంతమైన మనస్సుతో జీవించాలి. ఇదే సమతుల్యత, ఇదే నిజమైన శక్తి.

## ధ్యానంవల్ల లాభాలు

ధ్యానం ఒక శక్తివంతమైన టానిక్ లా పనిచేస్తుంది. భగవంతుని పాదాల నుండి ఒక దివ్యశక్తి సాధకుని నరనరాల్లో ప్రవహిస్తుంది. అతి పవిత్రమైన ఆధ్యాత్మిక తరంగాలు శరీరంలోని ప్రతి అణువులో ప్రవేశించి అన్ని రోగాలను దూరం చేస్తాయి. ధ్యానంచేసే సాధకులకు డాక్టర్ల బిల్లు నుండి విముక్తి లభిస్తుంది. మనిషిలో అన్ని రకాల ఉద్రేకాలను, మనోవికారాలను ధ్యానం నియంత్రణ చేస్తుంది. మనోవికారాలు నియంత్రణలో ఉంటే దుశ్చర్యలు చేయడం జరుగదు.

మీరు బ్రహ్మ ముహూర్తంలో ఒకటి, రెండు గంటలపాటు ధ్యానం చేస్తే దినమంతా ప్రశాంతంగా మీ విధులను నిర్వర్తించవచ్చును. ఏ విషయమైనా మీ మనస్సును చలింపచేయదు.

... అందరు మనవాళ్ళే అని మంచికోసం ఏదైనా చేస్తే... మనం చెడ్డవాళ్ళమైపోతాం

మీ శరీరంలోని సమస్త అంగాలు ఆధ్యాత్మిక తరంగాలతో, దివ్య భావనలతో నిండి ఉంటాయి. సక్రమ ధ్యానం అపరోక్ష జ్ఞాన ద్వారాలను తెరుస్తుంది. మనస్సును ప్రశాంతంగా, నిశ్చలంగా ఉంచుతుంది. ఒక పారవశ్య భావనకు తెరలేపుతుంది. యోగా, సాధకుణ్ణి పరమ పురుషుని మూలానికి తీసుకెళ్తుంది. ధ్యానయోగ పథంలో సాగిపోతే ఎలాంటి సందేహాలున్నా పటాపంచలై పోతాయి. ధ్యానం శక్తివంతమైన, స్వచ్ఛమైన ఆలోచనలను కలిగిస్తుంది. మనో దృశ్యాలన్నీ స్పష్టంగా ప్రస్ఫుటంగా ఉంటాయి. సదాలోచనలు దృఢపడతాయి. భావాలన్నీ స్పష్టంగా ఉండి సంశయాలు దూరమవుతాయి. ఆధ్యాత్మిక సోపానంలో పై మెట్టుకు ఎక్కాలన్న సద్భావన మీలో కలుగుతుంది. మీ అంతరంగం నుండి ఓ నిగూఢమైన అంతర్వాణి మీకు మార్గ దర్శనం చేస్తుంది. ఆ వాణిని శ్రద్ధగా ఆలకించండి.

దుర్గుణాలవల్ల ఎగసిన దుర్గంధాన్ని ధ్యానాగ్ని నాశనం చేస్తుంది. అకస్మాత్తుగా దివ్య జ్ఞానం కలిగి మోక్షానికి దారితీస్తుంది.

ధ్యానం చేయి. ధ్యానం చేయి. ఒక్క క్షణం కూడా వృధా చేయకు. ధ్యానం జీవితంలోని అన్ని దుఃఖాలను దూరం చేస్తుంది. ప్రశాంతమైన, ఆధ్యాత్మిక జీవనానికి ధ్యానమే ఏకైక మార్గం.

✶

**కృష్ణుడిలా సమయస్ఫూర్తి కలిగి ఉండాలి. రాముడిలా నిజాయితీ కలిగి ఉండాలి. కర్ణుడిలా ధైర్యంగా ఉండాలి. ఇంద్రుడిలా అందంగా ఉండాలి. మన్మథుడిలా శృంగార శాస్త్రం తెలిసుండాలి**

✶✶✶

**నిన్ను నీవు తీర్చి దిద్దుకుంటే మొదట నీవు సంతోషంగా ఉంటావు. తరువాత సంతోషంగా అందరికి కనబడతావు. అటు తరువాత అలవాటుగా మారి గొప్ప వ్యక్తిగా గుర్తించబడతావు**

✶✶✶

**మీ జీవితాన్ని ఇతరులతో పోల్చుకోకండి. సూర్యచంద్రులకు పోలికలు చూశారా. ఎవరి మార్గం వారిది**

**ఒకరు మరొకరికి హాని చేస్తుంటే చూసి నవ్వడం తేలిక, ...**

# జీవుడా మేలుకో!

- బ్రహ్మలీన శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి

**1) ఎట్టిప్రాణికి కీడువలదన్నా**
**కీడుచేసిన, నిన్ను నీవే కొట్టినట్లన్నా**
**విశ్వరూపమునందు తాను**
**పరుడు ఒకటే యగుచునుండగ**
**హింసభావము అర్థరహితము**
**తెలివినొందిన వైరముడుగును**
**తత్త్వసారము తెలిసికోరన్నా**
**సద్గురుని చెంత, నిజము గనుగొని లాభమొందన్నా!**

నదీజలమును ఏ తీరములనుండి స్పృశించినను ఆ నదీ ప్రవాహమునంతటిని స్పృశించినట్లగును. శరీరములోని ఏ భాగమునకు సుఖముగాని, దుఃఖముగాని కలిగినచో అది దేహము మొత్తమునకు సంబంధించినదగును. అటులనే సృష్టిలోని ఏ జీవికి ఉపకారము చేసినను, లేక అపకారము చేసినను అది విశ్వరూపుడగు భగవంతుడు ఒనర్చినట్లే కాగలదు. పరోపకారము, భగవత్సేవవలన మనుజుడు శ్రేయమును, ఆనందమును బడయును. అట్లుగాక పరపీడ, హింస, అపకారము చేసినచో అది తనకే దుఃఖము గలిగించును. ఒక ప్రాణికి కీడుచేసిన అది తనకు చేసుకొనినట్లే కాగలదు.

సర్వులు తన ఆత్మస్వరూపులే కావున ఒకరికి కీడుచేసినను, లేక మేలాచరించినను అది తనకే ఆయా ఫలితములనిచ్చును. కావున జనులు హింసాప్రవృత్తిని, వైరభారమును వదలివైచి తోటివారి యెడల ప్రేమ, కరుణ, సహకారము, ఉపకారభావన, త్యాగభావన కలవారై, విశ్వాత్మస్వరూపులైన పరమసుఖశాంతులను అనుభవించవలెను.

ఓ జీవుడా మేలుకో. భేదదృష్టిని విడనాడు. హింసాప్రవృత్తిని దరికి చేర్చకు. ఆత్మౌపమ్య దృష్టినలవరచుకొని తోటి ప్రాణులను సేవించు. జీవుల సేవయే శివునకు చేయు సేవగా

**... అదే తనకు హాని జరిగితే భరించడం చాలా కష్టం**

ఎఱుంగు, భూతసేవ, గురుసేవ, దైవసేవ ద్వారా మహత్తర శాంతిని అనుభవించు. నిన్ను నీవే ఉద్ధరించుకో, నీవలెనే సర్వులను వీక్షించు. అపకారభావన, వైరభావన వదలి పరోపకారబుద్ధి కలిగి వర్తించు. జన్మను సార్థకము చేసుకో.

**2) దేహమందున సొగసులేదన్నా**
**సొగసు అంతయు ఆత్మలోనే కలదురోరన్నా**
**రేపో మాపో క్రుళ్ళిపోయే**
**దేహమందున సొగసు ఎచట**
**పుట్టకుండను చావకుండను**
**ఉండు ఆత్మకె సొగసు ధరలో**
**తత్త్వసారము తెలిసికోరన్నా**
**సద్గురుని చెంత, నిజము గనుగొని లాభమొందన్నా !**

రమణీయమైన, సౌందర్యమైన వస్తువు ఆనందమును కలిగించును. ఈ దృశ్యజగత్తులో సొగసైన వస్తువేదియో విజ్ఞుడు కొంత విచారణసలుపవలెను. సుందర పుష్పముగాని, అందమైన భవనముగాని, లోకైకసుందరిగాని, లేక మరే ప్రాపంచిక సౌందర్యవస్తువుగాని కొలిదికాలములోనే పరిణామముపొంది కాలగర్భములో లీనమైపోవుచున్నది. అట్టటి ఆ దృశ్యపదార్థములందు రమణీయత్వము, సొగసు ఎచటగలదు? దేహము కూడ దృశ్యపదార్థములలో చేరినదేకనుక దాని యందును సొగసుగాని, సౌందర్యము గాని లేదు. సచలమై, క్షణికమై రేపోమాపో నశించిపోవునట్టి దేహాదులందు అందమెచట? వాస్తవ సౌందర్యము, రమణీయత నాశములేని, శాశ్వతమైన ఆత్మయందే కలదు. చావు పుట్టుకలు లేని దైవమందే పూర్ణానందము గలదు.

కావున ఓ జీవుడా! దృశ్యవ్యామోహమను మత్తు నుండి మేలుకో! సద్గురు వరేణ్యుని సేవించి తత్త్వసారము తెలుసుకో. నిత్యశాంతి, శాశ్వతసౌందర్యము శరీరమందుగాని, బంధ్వాదులందుగాని, ధనధాన్యాది సంపదలందుగాని లేవు.

కొంతకాలము మాత్రమే రమణీయముగ కనబడు దృశ్యవస్తువులందు మోహమును కలిగియుండకు. నిత్యమైన, మహత్తర సౌందర్యప్రదమైన ఆత్మ కొరకే కృషిసలుపు, ధన్యుడవుకా.

✶

**కోరిక, కొన్నేళ్ళ బతికిస్తుంది. ఆశ వచ్చేదాక బతికిస్తుంది. ...**

# ప్రతి రాత్రీ శివరాత్రే కావాలి !

**- ధర్మవీర**

ఏటా వచ్చే శివరాత్రి వచ్చింది.

ఉపవాసాలూ - వ్రతాలూ - భజనలూ - దీక్షలూ ఎవరు పాటించాల్సిన వారు పాటించారు. వచ్చే శివరాత్రికి కూడా పాటిస్తారు.

ఇది కాల చక్రం

ఇది శక్తి చక్రం

కాలం శక్తిని నిలుపుతుంది. శక్తి కాలాన్ని నడుపుతుంది.

అది కన్ను.

ఒక కన్ను కాదు ; మూడు కన్నులు.

ఆ కన్ను ఈ కాలాన్ని చూస్తున్నది ; ఆదేశిస్తున్నది ; శక్తిని నిర్దేశిస్తున్నది.

అదే జీవకోటిలో మానసిక శక్తిని నిలుపుతున్నది.

జన సామాన్యమనుకొనే దాన్ని అసామాన్యంగా చేస్తున్నది.

ఈ మూడు కన్నులు సూర్య చంద్రాగ్ని గోళాలే ?

అసలా మూడో కన్ను ఏమిటి ?

అది అగ్నినేత్రమా !

జ్ఞాన నేత్రమా !

ఈ విశ్వంలో ఎవరికీ కనిపించనిది కంటూ, ఎప్పుడెప్పుడు సమతౌల్యం దెబ్బదింటే అప్పుడప్పుడు సరిజేస్తున్నదా !

అది సరిజేస్తున్నదనేది ఊహా ! శాస్త్రీయ సత్యమా !

కంటికి కనిపించని ఈ పని ఆ మూడోకన్నే సరిజేస్తున్నదని అంగీకరించేదెలా ! ఇలా భావిద్దామా !

**... కానీ, ఆశయం మాత్రం చావే లేకుండా చేస్తుంది**

శ్రమ – శక్తి – ఫలితం.

సత్యం – శివం – సుందరం.

ఈ మూడింటిని సాధించడానికి ఆ మూడోకన్ను త్రిశూలాన్ని పరమాధారంగా స్వీకరించిందా.

ఈ స్థూల నేత్రాలకు ఆ మూడో కన్ను గాని, ఈ త్రిశూలం గానీ కనిపించదు.

త్రిశూలం.

ఆ మూడు మొనలు చూడండి !

అది ఊర్ధ్వ గమనమై వెళ్లే ఓంకారంగా దృష్టి పథంలో నిలుస్తున్నదా !

అమావాస్యనాడైనా వెన్నెలలను పూయించే మహాశక్తిగా దృగ్గోచరమవుతున్నదా !

సత్త్వ రజస్తమస్సులను ఆ త్రిశూలమే సృష్టిస్తున్నదనే భావన కలుగుతున్నదా !

త్రినేత్రం.

త్రిశూలం.

త్రిగుణాలు.

ఈ త్రిగుణాలెక్కడ ఉన్నాయి !

విశ్వమంతటా – సర్వ జీవకోటుల్లో ఉన్నాయి.

ఉండి ఏం చేస్తున్నాయి !

ఉద్రేకాలు కలిగిస్తున్నాయి.

ఉత్పత్తిని చేస్తున్నాయి.

నిన్నూ – నన్నూ నిలుపుతున్నాయి.

నీవున్నావు.

త్రిశూలమున్నది.

త్రినేత్రమున్నది.

నీకొక రూపం కల్పించుకొన్నాం.

నేత్రాన్నీ నిర్దేశించాం.

త్రిశూలానికీ ఆకారమిచ్చాం.

**ఈ లోకంలో నువ్వు ద్వేషించినా కూడా నిన్ను ...**

ఈ ప్రతీకల్లో నిన్ను చూస్తున్నాం.

నిజం వైపుగానే పయనించాలని ప్రయత్నిస్తున్నాం. కాని ఆ త్రిశూలంలోని ఒక మొన మమ్మల్ని తమస్సులోకి ఎందుకు తోస్తున్నది.

మరొకటి ఉత్పత్తి నెందుకు చేయిస్తున్నది.

ఈ రెండింటికీ మనస్సునూ శరీరాన్ని సాధనాలుగా ఎందుకుజేస్తున్నది.

మేము ఆశకు లోనవుతున్నాం.

మాయలో పడుతున్నాం.

సత్యం (సత్త్వం) కనిపించడం లేదు. మాయ కట్టుబాట్లలో మరణం వైపుగా ప్రగమిస్తున్నాం.

తమ సోమాజ్యోతిర్గమయ – ఇది కాదు.

మృత్యోర్మా అమృతంగమయ – అసలే కాదు.

ఇది ఉత్పత్తి వినాశనాల భౌతిక రూపం మాత్రమే !

మేము ఆశిస్తున్నది అది కాదు.

నీ సత్యం – శివ – సుందరత్వాన్ని వదలి మేము రాత్రిలో అడుగు పెడుతున్నాం.

శివుడు లేని రాత్రి మాకు వద్దు.

శివుడున్న రాత్రి కావాలి మాకు.

శివరాత్రి కావాలి మాకు.

✶

**శరీరంలో దాగి ఉన్న ఆత్మ జ్యోతి ప్రకాశమే ప్రాణం. ఆ ప్రాణం శరీరమందు గల ప్రతి అణువులో ఉంటుంది. ఆ శక్తే పరమాత్మ. అదే జ్ఞానం. అన్ని కాలాలలో జ్ఞానానికే ప్రాధాన్యత, జ్ఞానముగల మనిషికి అన్ని సమకూరుతాయి.**

✶ ✶ ✶

**ప్రేమినిచ్చిన ప్రేమ వచ్చును - వెంట తృప్తి ఆనందం కూడా వచ్చును.**

**... ప్రేమించేవారు ఉన్నారంటే అది కేవలం నీ తల్లిదండ్రులే**

# మంగళకర అభయ హనుమ

- కమలేకర్ డాగోజిరావు

పల్లవి॥ ఓ అభయవీర హనుమా !
జై అభయదాత హనుమా ॥ ॥ఓ॥

1) చ॥ మహిమలతో వెలసినావు
మదిని భక్తి నిలిపినావు
భక్త జనుల నేలుకొంటు
శక్తిని మది నింపుతావు ॥ ॥ఓ॥

2) చ॥ కరుణతోడ మమ్ముగాంచి
కార్యసిద్ధి కలుగజేసి
అద్భుతముల నెన్నొ చూపి
అభయదానమిత్తు వీవు ॥ ॥ఓ॥

3) చ॥ శేషతల్పశయన హనుమ
ఈషణముల బాపు హనుమ !
శ్రీనివాస నగరమందు
సిరులు నింప చేరినావు ॥ఓ॥

4) చ॥ నామ జపము చేసినంత
భయము బాధ చీకుచింత
సమసిపోవు మనసునందు
సకల సౌఖ్య శుభములందు ॥ఓ॥

5) చ॥ పాహి పాహి ! పవనపుత్ర
రక్ష ! రక్ష ! రామ దూత
మంగళకర అభయ హనుమ
మంగళమే మాకొసగుమా ! ॥ఓ॥ ✶

మేధావులు మాట్లాడుతారు - మూర్ఖులు వాదిస్తారు

# హనుమాన్ చాలీసా - 22

- అను, వ్యాఖ్య : ఆచార్య కసిరెడ్డి

**హిందీ :** సబ సుఖలహై తుమ్హారీ సరనా ॥
తుమ రక్షక కాహూకో డరనా ॥

**తెలుగు :** నిన్ను శరణన్నచో సకల సుఖములు కలుగు
నీదు రక్షణ ఉన్న భయమేల మఱి కలుగు.

**భావం :** నిన్ను శరణుకోరిన వారికి సకల సుఖాలూ లభిస్తాయి స్వామి ! నీ రక్షణలో ఉన్న వారికి భయమేల కలుగుతుంది.

**వ్యాఖ్య :** హరుని అంశలో ఆవిర్భవించిన ఆంజేయ స్వామి శ్రీరామభక్తుడై, హరిహరుల శక్తితో సాధుజన రక్షకునిగా నిలిచాడు. శరణన్న వారినే కాకుండా ఆర్తులందరినీ ఆదుకొనే దివ్యగుణ శోభితుడు ఆంజనేయుడు. దాసోహం కోసలేంద్రస్య అంటూనే శరణన్న యయాతి మహారాజును రక్షించాడు. శక్తికీ భక్తికీ జరిగిన సంవాదంలో భక్తే గెలిచింది.

భక్తికీ శక్తికి ప్రతీక హనుమంతుడు. రామచంద్రునికి ఆంజనేయునికి అభేదం. అందుకే ఎవరి సన్నిధికి శరణాగతి అని వెళ్లినా ఇద్దరి సన్నిధికి వెళ్లినట్లే. వారికి రక్షణ ఉంటుంది. భయమనేది ఉండదు.

చిన్న ఉదాహరణ : రామా రామా నన్ను రక్షించు రక్షించు అని కప్ప అరిచింది

నీకు వచ్చిన ఆపద ఏమిటి ? రాముడడిగాడు.

నాకు ఆపద మీ ధనుస్సువల్ల వచ్చింది అన్నది కప్ప

'ఎలా' అడిగాడు రాముడు

మీ ధనుస్సు క్రింద నేనున్నానన్నది కప్ప ! రక్షించేవాడే బాధిస్తే నేనెవరికి చెప్పుకొనేది అన్నది కప్ప.

శ్రీరాముడు వెంబడే కప్పకు స్వేచ్ఛనిచ్చాడు. ఆంజనేయుడు రామ ప్రభువుకు నమస్కరించాడు. రక్షణంటే అది ! నిర్భయంగా జీవనమంటే అది. ✶

మన లోపాలను మనం తెలుసుకోవడం అన్నింటి కన్న పెద్ద చదువు

# నారాయణీయ సంక్షిప్త వివరణము

*(గత సంచిక తరువాయి)* - **శ్రీమతి హేమలతా బాలసుబ్రహ్మణ్యం**

**81) ఇతర పట్టమహిషులు –** పాండవులకు భాగముగా వచ్చిన ఇంద్రప్రస్థమును విశ్వకర్మచేత (దేవశిల్పి) ఒక మహానగరముగా నిర్మింపచేసెను. కుంతీ పుత్రులైన పాండవులైదుగురు ద్రౌపదిని వివాహమాడగా సత్యభామాదేవితో సహా వారి వివాహమునకు వెళ్ళి వారిని ఆశీర్వదించి తమ సోదరియైన సుభద్రను కాషాయ వేషధారియైన అర్జునునకిచ్చి వివాహముచేసెను. అటు తరువాత యమునా నదీతీరములో విహరించుచున్న కాళిందిని, అవంతి రాజకుమారియైన మిత్రవిందను, మద్రదేశపు రాజకుమారియైన లక్ష్మణాదేవిని, అయోధ్యా రాజకుమారియైన సత్యను, కేకయరాజ కుమారియైన భద్రను, ఇలాగే భీష్మకుని పుత్రికయైన రుక్మిణిని, జాంబవంతుని పెంపుడు కూతురైన జాంబవతిని కృష్ణవేషధారియైన పరమాత్ముడు వివాహమాడెను. ఇదేగాకుండా శ్రీకృష్ణపరమాత్మ భామాసహితుడై నరకాసురునితో యుద్ధముచేసి, అతనిని అంతమొనర్చి, ముక్తినిచ్చి అతనిని పవిత్రునిచేసి తరువాత ఇంద్రలోకమునకు వెళ్ళి అతని గర్వమునణచి దేవపారిజాత వృక్షమును దేవలోకమునుండి భూలోకమునకు సత్యభామకు కానుకగా యిచ్చెను. వీరే కాకుండ నరకుని చెఱలోనున్న 16 వేల మంది కన్యలను చెఱవిడిపించి వారినందరిని వివాహమాడి సుఖపెట్టెను.

**82) ఉషాపరిణయము –** భగవంతుడైన శ్రీకృష్ణుని పుత్రుడైన ప్రద్యుమ్నుని కుమారుడైన అనిరుద్ధుడు రుక్మిణి యొక్క మనుమరాలిని వివాహమాడగా కృద్ధుడైన రుక్మిణి, కృష్ణునితో పోరాడగా బలరాముడు అతనిని సంహరించెను. అలాగే శివభక్తుడయిన బాణాసురుడు తన కుమార్తెయయిన ఉషాదేవీని ప్రేమించిన అనిరుద్ధుని పట్టి బంధించి కారాగారమునందు ఉంచెను. అప్పుడు శివగణములు, యాదవగణములు పోరాడగా శివుడు, షణ్ముఖుడు కృష్ణవేషధారియైన భగవంతునిని ఎదురించగా చివరలో శివుడు కృష్ణుని గూర్చి తెలుసుకొని ఉషా అనిరుద్ధుల వివాహమును జరిపించెను. ఈ విధముగా ముక్కంటినే జయించిన శ్రీకృష్ణుడు ఆదిమధ్యాంతములు లేని వస్తువాయెను.

**83) పౌండ్రక వధ –** భగవంతుడైన శ్రీకృష్ణునితో సమానమైన రూపముగల పౌండ్రకుడనే రాజు తానే నారాయణుడనని విఱ్ఱవీగి కృష్ణరూపధారియైన భగవంతునినే నిందించుచుండగా

**గెలిచేవరకు తెలియదు కావలసిన వాళ్ళున్నారని, ...**

సత్యనిరూపణార్థము అతని శిరస్సును తన సుదర్శన చక్రముతో ఖండించి అతని అనుచరులను కూడ వధించెను. ఇలా వుండగా నరకుని మిత్రుడగు వివిధుడనువాడు కృష్ణునెదిరించి పోరుసల్పుటకురాగా, బలరాముడు అతనిని తన అరచేతి దెబ్బతో చంపెను. అదే సమయంలో దుర్యోధనుడు కృష్ణుని కుమారుడైన సాంబుని చెఱ పట్టగా బలరాముడు అతనితో పోరాడి సాంబుని విడిపించెను.

**84) సమంత పంచక యాత్ర (లేక) కురుక్షేత్రగమనము –** ఇలా వుండగా కృష్ణరూపుడైన భగవంతుడు సమంత పంచక తీర్థములో స్నానమాచరించి, ఆ నదిని సమస్త పుణ్యనదులలోకెల్ల పవిత్రముగావించెను. అదే సమయములో ద్వారకానగర మహిళలు అక్కడికి రాగా వారికి సంపూర్ణ సుఖములను ప్రసాదించి జ్ఞాన తత్వయోగ ద్వయములను బోధించి భక్తి భావమును గూర్చి సంపూర్ణముగా విశదీకరించెను. తదుపరి వేణుగానముతో అందరిని మురిపించి స్నేహమును గౌరవించి ఆ కురుక్షేత్రములో స్వల్పకాలము వారందరితోను క్రీడించెను.

**85) యుధిష్ఠిరుని రాజసూయయాగము, శిశుపాల జరాసంధులవధ –** మగధరాజైన జరాసంధుడు రాజులందరిని జయించి వారిని కారాగారములో బంధించి అనేక బాధలను పెట్టుచుండగా అతనిని వధించుటకు కృష్ణరూపుడైన పరమాత్మ నిశ్చయించగా అదే సమయములో యుధిష్ఠిరుడు పాండవ, కౌరవ యాదవులందరిని రాజసూయ యాగమునకు ఆహ్వానించెను. అప్పుడే శ్రీకృష్ణుడు భీమార్జునులతో సహ మగధదేశమునకువచ్చి భీమ జరాసంధుల మధ్య మల్లయుద్ధము జరుగునట్లు వ్యూహముపన్ని ఆ యుద్ధము తీవ్రత నొందినప్పుడు కృష్ణుడు ఒక మామిడికొమ్మను విరిచి వ్యత్యస్తముగా వేసి చూపగా భీముడు దానినర్థము చేసుకొని జరాసందుని శరీరమును రెండుగా చీల్చి కుడి ఎడమలుగా పడవేయగా అతడు మరణించెను. అటుపిమ్మట వారందరు రాజసూయయాగమునక వెళ్ళగా యుధిష్టిరుడు శ్రీకృష్ణుని ప్రథమ పూజార్హుడుగా నెంచి అగ్రపూజ చేయగా దానిని గాంచిన ఛేదినృఫాలుడైన శిశుపాలుడు భగవంతుడైన శ్రీకృష్ణుని "పశులకాపరి" యని నానావిధములుగా నిందించగా అతని శతాపరాధములను (మేనత్తకిచ్చిన వాగ్దాన ప్రకారము) క్షమించిన కృష్ణుడు తన సుదర్శన చక్రముతో అతనిని వధించెను. అదే సమయములో మయసభలో భంగపడిన దుర్యోధనుని చూచి ద్రౌపదీ భీములు నవ్వగా ఆ సంఘటనయే మహాభారత యుద్ధమునకు బీజమాయెను.

**86) శాల్వాదులవధ – భారతయుద్ధము –** ఎప్పుడైతే కృష్ణవేషధారియన భగవంతుడు రాజసూయ యాగమునకు వెళ్ళెనో అప్పుడు తన చిరకాలపగను తీర్చుకొనుటకై శివగణముల సహాయముతో సాల్వుడు ద్వారకను ముట్టడించగా అప్పుడే ద్వారకకు మరలివచ్చిన శ్రీకృష్ణుడు బలరామసహితుడై వచ్చి సాల్వునిని వధించెను. పిమ్మట హస్తినలో దుష్టుడైన దుశ్శాసనుడు

**... డబ్బు సంపాదించే వరకు తెలియదు ప్రేమించే వాళ్ళున్నారని**

పాంచాలీ వస్త్రాపహరణము చేయుచుండగా కృష్ణుడు అక్షయములైన వలువలను ప్రసాదించి ఆమె మానసంరక్షణముగావించెను. వనవాసములో పాండవులుండగా రుద్రాంశ సంభూతుడైన దుర్వాసుడు తన వేయిమంది శిష్యులతో కూడి భోజనమునకు రాగా సూర్యప్రసాదితమైన అక్షయపాత్రలో ఒక ప్రక్కగా అంటుకొనియున్న అన్న కణముతో కలిసిన ఒకే ఒక ఆకుకూరను కృష్ణుడు భుజించగా శిష్యబృందముతో కూడిన మహర్షి క్షుద్బాధారహితుడై తిరగిపోయెను. భారతయుద్ధ ప్రారంభాత్పూర్వము కౌరవ పాండవలిరుపక్షముల వారు కృష్ణుని సహాయము కోరి కృష్ణసదనమునకు రాగా భగవద్రూపుడైన మురారి వీరులైన నారాయణ సేనలును కౌరవులకును తనను పాండవులకును పంచియిచ్చెను. ఆ తరువాత పాండవుల కోరికననుసరించి దుష్టుడైన దుర్యోధనుడు భీష్మద్రోణాదులు ధృతరాష్ట్రుడు మొదలగు వారు వున్న సభలోనికి పాండవ శాంతి దూతగా వెళ్ళి, ఆ రాయబారము విఫలమైనందువలనను అదే సమయములో తనను మోసముతో బంధించుటకు ప్రయత్నించిన కౌరవసభలో విశ్వరూపమును దాల్చి సర్వులను భయభ్రాంతులను చేసెను. అటుపిమ్మట కురుక్షేత్రములో కదన ప్రారంభాత్పూర్వము తన బంధు మిత్ర స్నేహితులను వధించుటకు వెనుకాడిన చింతాక్రాంతుడైనటువంటి పాండవమధ్యముడైన పార్థునికి మోహాపహరణము కొఱకై "శ్రీమద్భగవద్గీత" నుపదేశించి తన విశ్వరూపమును ప్రదర్శించి ఆ విజయునికి సారథి ఆయెను. భీష్ముణి వధించుటకు వచ్చిన పార్థుడు వికల మనస్సుతోనుండగా భగవంతుడు చక్రధారి ఆయెను. శస్త్రాస్త్రకుల గురువైన ద్రోణుడు సంధించిన నారాయణాస్త్రమును స్తభింపచేసెను. సూర్యాస్తమును కలుగు చేయుటకై తన సుదర్శన చక్రముతో సూర్యుని మరుగుచేసి జయద్రధవధగావించెను. సూర్యపుత్రుడైన కర్ణుడు అర్జునవధ కొఱకు ప్రయోగించిన నాగాస్త్రమును అర్జునునికి తగలకుండ రథమును భూమిలోనికి అణగద్రొక్కి అర్జునుని కాపాడెను. అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రమును  అర్జునునిచే త్రిప్పికొట్టించి అతని శిరోరత్నమునపహరింప బడునట్లు చేసెను. అనగా బ్రహ్మాస్త్ర నుండి ఉత్తరా గర్భమును కాపాడెను. భీష్మపితామహుడు. స్వచ్ఛంద మరణుడు కనుక ఆయన ప్రాణత్యాగము చేయక మునుపు చివరగా తన విశ్వరూపమును చూపెను. భారత సంగ్రామములో విజయుడైన యుధిష్ఠరునిచేత అశ్వమేధయాగమును చేయించెను.

**87) కుచేలోపాఖ్యానము –** లీలా వేషధారియైన శ్రీకృష్ణుడు ఒకప్పుడు గురుకులవాసము చేయుచుండగా ఆయనకు కుచేలుడను వాడు ప్రియమిత్రుడుగా నుండెను. గురుకులవాసము సంపూర్ణముకాగానే కృష్ణుడు ద్వారకాధీశుడు కాగా కుచేలుడు అధిక సంతానవంతుడై బీదరికముచేత అనేక కష్టములకు పాలగుచుండగా అతని భార్య ప్రేరణచేత ద్వారకకువచ్చి కృష్ణసమాగమముతో ఆనందితుడై తన మిత్రుని కొఱకు తెచ్చిన అటుకులను అతనికిచ్చి

**జీవితంలో ఎంతో మంది స్నేహితులుంటారు. ...**

తాను వచ్చిన విషయమును విస్మరించి తన గృహమునకు వెళ్ళగా అచ్చట తన గృహమున్నచోట ఒక మహాసౌధమును ఆ సౌధములో సమస్తములైన ధన, కనక, వస్తు, వాహనములను చూచి అడిగినను అడగకున్నను ఇచ్చేటువంటి భగవంతుని అనుగ్రహమును మదిలోనెంచి ఆనందభాష్పములు రాల్చెను.

**88) అన్యలీలలు –** శ్రీకృష్ణుని తల్లియైన దేవకీదేవి ఒకనాడు శ్రీకృష్ణునితో కంసునిచేత హతమొనర్పబడిన. తన పుత్రులను చూడవలెనని చెప్పగా ఆమెను దేవలోకమునకు తీసుకొని వెళ్ళి ఆ పుత్రులతో పరిచయముగావించెను. ఇలాగే ఒకప్పుడు కృష్ణభక్తులైన ఇరువురు ఒకరికి తెలియక మరియు యొకరు భగవంతుని తమ తమ గృహములకాహ్వానించగా, కృష్ణరూపుడైన భగవంతుడు తనను రూపద్వయముగావించుకొని ఇరువురి గృహములకు వెళ్ళి వారిని అనుగ్రహించెను. మరొక్కప్పుడు సప్తమృత శిశువులను ప్రసవించిన బాధచేత శోకమునొందిన ఒక విప్రుడు బాధపడుచుండగా అర్జునుడు ఆ అష్టమ శిశువును రక్షించుచుటకు శరములతో ఒక హర్మ్యము నిర్మించగా ఆ సమయములో జన్మనీయగా అచ్చటనున్న వారు పరితపించగా కృష్ణరూపుడైన భగవంతుడు అర్జునునితో సహ సప్తదీపములతో కూడిన సప్తసాగరముల నతిక్రమించి పరమపదమునకు వెళ్ళగా అచ్చట శేషతల్పశాయియైన ఒక మహాపురుషుని చూచిరి. అప్పుడా పురుషుడు వారినిగాంచి “మీరిరువురు నర–నారాయణరూపులై భిన్నముగా కనుపించినను అదేవిధముగా మీ ఇరువురిలో ఒకరియందు దివ్యత్వము మరియొకరియందు జీవత్వము కనుపించినను మీ ఇరువురిని ఒకేసారి చూడవలెనని కోరిక కలుగుటవలన ఈ లీల జరుపబడినది” యని చెప్పి ఆ విప్రుని పుత్రులను వారికప్పగించెను.

**89) వృకాసుర వధ, భృగుపరీక్షణము –** పూర్వము శకుని యనే రాక్షసుని పుత్రుడు వృకాసురుడనే పేరు కలిగిన (భస్మాసురుడు) శివుని ఆరాధించి తన యొక్క హస్తమును ఎవరి మస్తకమందుంచెదనో వాడు వెంటనే భస్మమై పోవునట్లు వరమును పొంది ఆ వరమును పరీక్షింపదలచి శివుని శిరమందే తన హస్తమునుంచుటకు ప్రయత్నిస్తు శివుని వెంబడించగా అప్పుడు భగవంతుడైన శ్రీకృష్ణుడు విప్రబాలకుని వేషముతో అతనిని సమీపించి “శంకరుడిచ్చిన వరములన్నియు అసత్యములవియు అలాపరీక్షింపదలచినచో నీ హస్తమును నీ శిరమందే నుంచుకొని పరీక్షించుకొను” మనగా ఆ రక్కసుడలాగే చేసి భస్మమాయెను. ఇలాగే ఒకప్పుడు యాగము చేయుచున్న ఋషులలో ఒక వాదము జరిగెను. అనగా “త్రిమూర్తులలో సత్వగుణాన్వితుడెవరు”? ఈ విషయమును తెలుసుకొనుట కొఱకై భృగుమహర్షిని పంపగా ఆ ఋషి సత్యలోకము కైలాసములకు వెళ్ళి బ్రహ్మ ఈశ్వరులను పరిశోధించగా వారిరువురు

**... మంచి జీవితానికి తోడ్పడేది కొద్దిమంది మాత్రమే**

ఆ ఋషిని కోపగించిరి. తరువాత ఆ ఋషి వైకుంఠమునకు వెళ్ళగా అచ్చట లక్ష్మీనారాయణులు ఒకరికొకరు అన్యోన్యముగా వీక్షించుటను గాంచిన ఆ భృగుమహర్షి విష్ణువు యొక్క వక్షస్థలమును తనకాలితో తన్నగా కృష్ణరూపధారియైన విష్ణువు ఆ ఋషిని కోపగించక తెలియక చేసిన తన అపరాధమును క్షమించమని కోరి ఆ ఋషి పాదచిహ్నములు తన వక్షస్తలమున ఎల్లప్పుడును ఆ భరణముగా నుండునని ప్రశాంతముగా పలికెను. కావున నారాయణుడు ఎల్లప్పుడు సత్వగుణ సంపన్నుడే.

**90) విష్ణుమహత్త్వము –** విష్ణువే. సర్వవిత్ సర్వజ్ఞుడు అనగా విష్ణువే పరబ్రహ్మము. పరంధాముడైన అతడే వ్యక్తావ్యక్త స్వరూపములన్నింటికిని కారణభూతుడు. త్రిమూర్తులలో ప్రథముడు. అతనిని గూర్చి గ్రంథకర్త, ఇలా కీర్తించుచున్నాడు. "బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు అను పంచమూర్తులలో సదాశివరూపమైన పరమాత్ముడవు నీవే; బ్రహ్మాండమునకు ఆవలనున్న వైకుంఠాధిపతివి నీవే ; త్రిమూర్తులలో సత్వగుణ నాయకుడవు నీవే ; జగద్గురువులైన ఆదిశంకరులు సమస్త దేవతా స్వరూపుడవైన నిన్నే స్తుతించిరి. ఇదేవిధముగా "పురాణ సంగ్రహము" అనే గ్రంథము భగవంతుడైన నిన్నే సర్వదేవతల స్వామియని పేర్కొనెను. ఇవేగాక పురాణసారము వ్యాసభాగవతము కృష్ణరూప ధారియైన ఈ భగవంతునినే జ్యోతిస్వరూపముగా ఆరాధించుచున్నది. ఇటువంటి మహోత్కృష్టమైన ఆ నారాయణునికి నమఃసుమాంజలులు.

*(సశేషం)*

## గృహస్తుడే మహా ఋషి

**ఇల్లు అనేది ఆకలి తీర్చే భోజనశాలయే కాదు. సుఖాలనిచ్చే వసతియే కాదు. అది ... ధర్మాన్ని నేర్పించే పర్ణశాల, అంతః శక్తినిచ్చే ధ్యాన మందిరం. తానేవరో తెలిపే జ్ఞాన పీఠం. నిన్ను రక్షించే అమ్మ ఒడి. మోక్షాన్నిచ్చే గర్భగుడి. అందుకే గృహస్తుడే మహాఋషి.**

సుఖదుఃఖాలు, కష్ట సుఖాలను ఎదుర్కొనేదే ...

# శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం

*(గత సంచిక తరువాయి)*

**సంకలనకర్త : శ్రీ సంకేపల్లి రాజమల్లారెడ్డి** **శబ్దార్థం : ఆచార్య కసిరెడ్డి**

**సర్వః శర్వః శివః స్థాణుర్భూతాదిర్నిధి రవ్యయః ।**
**సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభు రీశ్వరః ॥ (4)**

**25)** **సర్వః –** సర్వలోకాలలో సర్వమూ తెలిసినవాడు, సమస్తానికి ఉత్పత్తి స్థితి లయహేతువు అయినవాడు.

**26)** **శర్వః –** ప్రళయకాలంలో రుద్రరూపంతో అందరినీ సంహరించేవాడు.

**27)** **శివః –** బ్రహ్మ శివులిద్దరూ ఒకరే; విష్ణువు ఈ రెండు పేర్లతోనూ పిలువబడుతాడు.

**28)** **స్థాణుః –** శాశ్వతంగా నిలిచి ఉండేవాడు.

**29)** **భూతాదిః –** భూతాలకు ఆదికారణమైనవాడు.

**30)** **నిధిరవ్యయః –** వినాశము లేని నిధి వంటివాడు.

**31)** **సంభవః –** స్వేచ్ఛగా తనంతకు తానే జన్మించువాడు.

**32)** **భావనః –** కర్మ ఫలాలను అనుభవించే వారికి ఫలాలను కలుగజేయాలని భావించేవాడు.

**33)** **భర్తాః –** ప్రపంచాన్ని తన యందే నిలుపుతూ పోషిస్తూ ఉండేవాడు.

**34)** **ప్రభవః –** సకల ప్రాణులు తనయందే కలుగుతుండగా ఉత్తమ జన్మ కలవాడు.

**35)** **ప్రభుః –** అన్ని క్రియాల్లో సమర్థుడు; సర్వశక్తిమంతుడు.

**36)** **ఈశ్వరః –** ఉపాధి లేకుండానే సిద్ధించిన ఈశ్వరత్వమున్న వాడు.

**స్వయంభూః శంభురాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః ॥**
**అనాది నిధనో ధాతా విధాతా ధాతురుత్తమః ॥ (5)**

**37)** **స్వయంభూః –** తనంతకు తానుగానే జన్మించేవాడు.

**38)** **శంభుః –** భక్తులకు సుఖాన్ని కలిగించేవాడు.

**... జీవితం ఎప్పుడూ చిరునవ్వులు జీవితం ఓ కళ**

**39) ఆదిత్యః –** ద్వాదశాదిత్యులలో విష్ణువనే ఆదిత్యుడు.

**40) పుష్కరాక్షః –** పుష్కరములవంటి అంటే పద్మముల వంటి కన్నులు కలవాడు.

**41) మహాస్వనః –** శక్తిమంతమైన కంఠము గలవాడు, లేదా వేద రూపమైన ఘోషమున్నవాడు.

**42) అనాది నిధనః –** ఆది లేనివాడు, నిధనం (మరణం) లేనివాడు.

**43) ధాతాః –** ధరించువాడని అర్థం; అనంతనాగుడు తదితర రూపాలతో విశ్వాన్ని ధరించేవాడు; పోషించేవాడు.

**44) విధాతాః –** జీవరూపంతో యజ్ఞాలు చేస్తాడు, పరమేశ్వర రూపంతో సృష్టి చేస్తాడు; కర్మలను కర్మ ఫలాలను నిర్మిస్తుంటాడు.

**45) ధాతురుత్తమః –** ధాతు అంటేనే ధరించేది; ఉత్తమ పదాన్ని బట్టి విశేష రూపంతో (అనంతుడు, కూర్మము) ధరిస్తాడు, పోషిస్తాడు అని చెప్పాలి.

**అప్రమేయో హృషీకేశః పద్మనాభోఽమరప్రభుః ॥**
**విశ్వకర్మామను స్త్వష్టా స్థవిష్ఠః స్థవిరో ధ్రువః ॥ (6)**

**46) అప్రమేయః –** వస్తుతత్త్వ యథార్థ జ్ఞానమేదో అది బాగా తెలిసినవాడు.

**47) హృషీకేశః –** ఇంద్రియాలకు ఈశుడు. ఇంద్రియాలు వశము నందున్నవాడు. సూర్య చంద్ర కిరణములే కేశములుగా గలవాడు.

**48) పద్మనాభః –** పద్మము నాభి యందు కలవాడు.

**49) అమరప్రభుః –** దేవతలకు ప్రభువు అంటే రక్షకుడు.

**50) విశ్వకర్మాః –** విశ్వమంతా తనకర్మమే అయినవాడు. లేదా విశ్వమును నిర్మించినవాడు లేదా విశ్వకర్మ అనే వడ్రంగి నామమున్నవాడు.

**51) మనుః –** మననం చేసే మూలతత్త్వమున్నవాడు. మంత్రమనే అర్థం కూడా ఉంది.

**52) స్త్వష్టాః –** ప్రాణులను క్షీణింపజేసేవాడు.

**53) స్థవిష్ఠః –** పెద్ద పరిమాణమున్న వాటి కన్నా పెద్దవాడు. అనగా అన్నిటికన్నా స్థూలమని అర్థం.

**54) స్థవిర ధ్రువః –** వృద్ధుడైన అనాది పురుషుడు. అంతేగాక ధ్రువ శబ్దానికి స్థిరుడని అర్థం చెప్పుకోవాలి. అప్పుడు స్థవిరుడగు ధ్రువుడు అని భావించవలసి వస్తుంది.

*(సశేషం)*

**ఇసుకలోనే రాశాను చక్కెర అనుకున్నాయోమో మోసుకెళ్తున్నాయి చీమలు**

# మానసవీణ

- డా॥ పర్యాద సరళ

సీ॥ మహనీయులందరిన్ మనసారగా బిల్చి
వాణికొలువులోన వారి చేత
ఆశీస్సులిప్పించి ఆబాలగాయకుల్
మురిసిపోవుచునుండ మురిసిపోయి
ఆబాల గోపాలమానంద రసడోల
లూగుచుండ మనసులూయలూగ !
పాటలో మాటలో పదములో పలుకులో
భాషలో భావాలు పరిమళించ

తే॥గీ॥ వేషభాషలు రీతులు వెలుగులీన
దేశదేశాల మనకీర్తి తేజరిల్ల
నడకలను నేర్పగా నెంతొ నయముగాను
సాగె సంగీత సాహిత్యఝురులు పొంగి

సీ॥ చిన్నారి పొన్నారి చిరుగళమ్ములయందు
చిందు వేయును పాట చిత్రముగను
వన్నె వన్నెల పూలు చిన్నెలెన్నొ విరిసి
పన్నీరు జిలికిన పగిది గాను
సంధ్యా సమీరాలు సాగి సంగీతమై
బాల సరస్వతుల్ పాడిటుల
మనసు వీణలు మ్రోగ మధురగానలహరి
స్వరతరంగిణి తాను సాగినటుల

తే॥గీ॥ పాటలాపాత మధురమై పరిమళించి
రాగవల్లరులల్లుచున్ రంజిలంగ
పూలజల్లులై హృదయాలు పులకరించ
సరస రాగాల సురగంగ సాగివచ్చె

✶

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనదేది లేదు

# ద్రవిస్తేనే దైవం

కూర్పు : ఆకుల రామయ్య

సూర్యోదయమైంది. పద్మం వికసించింది. గడిచిన రాత్రంతా వికసించేందుకు పద్మం ఎంతగా ప్రయత్నించిందో ? కనుకనే ఉదయాన వికసించింది. మన హృదయ పద్మం వికసించిందా ? ఇది జరుగునపుడు, ఎంతకాలం ఊరేగితేమాత్రం ఏమి ప్రయోజనం? విరబూసిన పద్మమే సుగంధాన్ని విరజిమ్ముతుంది. విమలమతులే విశ్వానికి శాంతిని వితరణ చేస్తారు.

రాయి కదలదు. నీరు నిలువదు. ఉన్న చోటే ఉంటుంది రాయి. ఊరేగుతూ ఉంటుంది జలం. నీవు ద్రవిస్తేనే ఇతరులను స్పృశిస్తావు. ఇలా జీవించాలి అని తెలిపేందుకే, కదిలే నీరు కదలని రాయిని స్పృశించి ముందుకు పోతుంది. నీవు కూడా కరిగిపో. ఘనం ద్రవీభవిస్తుంది. సంశయం అవసరంలేదు. కొయ్య కరుగుతుంది. రాయి కరుగుతుంది. మబ్బు కరుగుతుంది. మాయ కరుగుతుంది. అది సాధ్యం కాదంటావా ? పోనీ, ఏది సాధ్యమో చెప్పు. కరుగుతూ కదలటం ఒక కళ. కరగలేకపోతే ఉన్నచోటే ఉండటం కూడా కళే. నేను కదలలేని బండను అంటుంది రాయి. కాని, అదే రాతిలో అందాన్ని చూస్తాడు శిల్పి. బండల్లో గుండె చప్పుళ్ళను వింటాడు అక్షర శిల్పి. సెలయేళ్లలో సరిగమలు వినేవాడు కవి. రాళ్లలో రాగాలను ఆలకించేవాడు శిల్పి.

కవి ఎవరో కాదు. శిల్పి మరెవరో కాదు. కవిని నీవేనని ఓ క్షణాన నీవే తెలుసుకుంటావు చెవిపెట్టి శిల్పివి నీవేనని ఓ నిముషాన నీవే గ్రహిస్తావు మనసు నిలిపి. రాతికి శిల్పి అందాన్నిచ్చాడా ? కాదు. వికారాన్ని తొలగించాడు. కఠినమైన వస్తువులో దాగియున్న కోమలత్వాన్ని బహిర్గతం చేశాడు. బ్రతుకు బజారులోపడి మనిషి ఎంత బండగా మారిపోయాడో! బండ బ్రతుకుల్లో భవ్యమైన అందం నిక్షిప్తమై ఉందని తెలుసుకుంటే చాలు. భారం తొలగుతుంది. దూరం తగ్గుతుంది. పారం పారిపోగా అపారం సారమై మిగుల్తుంది. కాకపోతే, “నేను బండను” అని అంగీకరించే మనిషి, “నేను శిల్పిని” అని అంగీకరిస్తే సరిపోతుంది. సిరి వస్తుంది. అమృతం కురిపిస్తుంది. ఇక్కడే,

**అంతఃకరణం అలలతో ఆడుకుంటుంది. చిత్తము పక్షులతో పరుగు లెత్తుతుంది.**

**మనసు రాజహంస పై విహరిస్తుంది. ‘అహం’ అంబరముతో విందారగిస్తుంది.** ✶

**దేవుడు చీకటి నిండిన గర్భగుడిలో లేడు - ...**

# స్వామి సత్యవ్రతానంద తృతీయ సమారాధనం సంస్మరణలో ఈ వ్యాసం



స్వామి సత్యవ్రతానంద

వ్యాసమహర్షి కాలం నుండే కాదు ఈ దేశంలో మానవ జీవనవ్యవస్థ మొదలైన కాలం నుండే ఆశ్రమాలున్నాయి. హిరణ్యాక్ష హిరణ్యకశిపులు ఆశ్రమాలమీద దాడులుచేసి, మునులను హింసించి, ఆశ్రమాలను ధ్వంసం చేశారంటే చూడండి ! కృతయుగం నుండే ఆశ్రమాలున్నట్లు తెలుస్తుంది.

కృత, త్రేత, ద్వాపర, కలియుగాల్లోని అన్ని ఆశ్రమాలు తపస్సుకూ, ధ్యానానికి, జ్ఞానానికి, నిష్కామకర్మ యోగానికి, భక్తికీ ప్రాధాన్యమిచ్చాయి. ఆశ్రమాలెందుకంటే ఇవన్నీ నేర్పేందుకనే సమాధానం. నేర్చుకొనేవారు నిత్య - నైమిత్తిక - కామ్యకర్మల్లో ఉన్నవారే. అందరూ సాధకులే ! వీరే ఆశ్రమాలకు రావాలని నియమమేంలేదు. అయితే నియమాలు పాటించాలనే నియమం మాత్రముంటుంది.

ఆశ్రమం సాధకులను తయారు చేస్తుంది. సాధకుల్లో కొందరు మాత్రమే గురువులై, ఆశ్రమ జీవితంలో ఉంటూ జ్ఞాన-యోగ ప్రచారకులుగా జీవనం గడుపుతారు. అయితే ఆశ్రమాల ద్వారా జ్ఞానం అందుకొన్నవారు తమ తమ కర్మల్లో (కర్మ యోగంలో) ఉంటూ, అందరి మధ్యన సమన్వయంతో జీవిస్తుంటారు.

అలా ఆశ్రమ ధర్మాలను అధ్యయనం చేస్తూ హైదరాబాదులోని హిమాయత్‌నగర్ ప్రాంతానికి విశ్వహిందుపరిషత్ కార్యదర్శిగా బాధ్యతలు పూర్వాశ్రమంలో నిర్వహించిన వారే (శ్రీ గరుడపల్లి అంజయ్య గుప్తగారు) బ్రహ్మలీన శ్రీశ్రీశ్రీ సత్యవ్రతానంద సరస్వతీ మహారాజ్ గారు. వారు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, విశ్వహిందూపరిషత్ కార్యక్రమాలలో ఇతర దైవభక్తి కార్యక్రమాలలో పాల్గొంటూ, హిందుత్వం గురించి, హిందూ జాతి-దేశ-ధర్మ-తత్త్వ- సంస్కృతుల గురించి అధ్యయనం చేశారు.

ఆ తదనంతరం పద్మారావునగర్‌లోని శ్రీ శివానందాశ్రమానికి సన్నిహితులయ్యారు. నాటి ఆంధ్రప్రదేశ్ హై కోర్టు న్యాయవాదులు శ్రీ వేణుగోపాలరెడ్డిగారి అధ్యక్షతన ఉన్న

**... పొలాల్లో, పరిశ్రమల్లో పనిచేసే శ్రామికుల చెంతన ఉన్నాడు**

దివ్యజీవన సంఘం ఈ ఆశ్రమాన్ని నిర్వహిస్తుండేది. అందులో సభ్యులై, కార్యకర్తయై విశిష్ట సేవలందిస్తూ శ్రీశ్రీశ్రీ దేవానందస్వాముల వారికి సన్నిహితులయ్యారు. వారి ద్వారా మంత్రోపదేశం పొంది నిష్ఠతో జపధ్యాన సాధనలు చేశారు.

ఈ మధ్యకాలంలో ఋషీకేశ్‌కు వెళ్లడం అక్కడి దివ్యజీవన సంఘకార్యక్రమాల్లో పాల్గొనడం జరిగేది. అలాంటి సమయంలోనే ఒకసారి నాటి అంతర్జాతీయ దివ్యజీవన సంఘ అధ్యక్షులైన శ్రీశ్రీశ్రీ చిదానంద సరస్వతీ మహారాజ్‌గారు 2000 వ సం॥లో సన్యాస దీక్ష ఇచ్చారు. ఆరోజు నుండి స్వామిజీ పూర్తిగా పరివ్రాజక జీవనంతో ఆశ్రమకార్యదర్శి బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు.

స్వామి శివానందసరస్వతి మహారాజ్ గారి బోధనల్లో ప్రధానమైన సేవించు, ప్రేమించు, సమర్పించు. పవిత్రుడవగుము, ధ్యానించు, సాక్షాత్కారం పొందు, తదితర ఆశయసాధనా పదసంపదను ఉదాహరిస్తూ వ్యాఖ్యానించేవారు. ముఖ్యంగా మంచిగా ఉండు .. మంచినే చెయ్... అనే పదాలను ఒత్తి చెప్పేవారు. తమ ఆశ్రమంలో ఈ పదాలన్నిటిని పెద్ద పెద్ద అక్షరాలతో ఇంగ్లీషులో వ్రాయించారు.

శ్రీ స్వామి వారు మాటల మధ్యలో హైదరాబాదు చరిత్రను, నిజాం పాలనలోని లోపాలను ప్రస్తావించేవారు. ఉర్దూ పదాలకు తెలుగులో సరిగా అర్థాలు చెప్పేవారు. హిందుత్వంలో ఏయే మత సంప్రదాయాలు ఎప్పుడెప్పుడు వచ్చాయో సోదాహరణంగా చెబుతుండేవారు. మహమ్మదీయుల దురాగతాలను ఎదుర్కొని హైదరాబాదులో ఆర్యసమాజం గట్టిగా నిలబడ్డ కారణంగానే హిందువులలో ఏకతా నిర్మాణం జరిగిందని చెబుతూ, చార్మినార్, టప్పాచబుత్రా, ఫీల్కానా తదితర ప్రదేశాల్లో జరిగిన సంఘటనలను వివరించేవారు. కె.వి. రంగారెడ్డి, కొత్తూరు సీతయ్య గుప్త, స్వామి రామానందతీర్థ, బూర్గుల, చెన్నారెడ్డి తదితర సామాజిక రాజకీయ నాయకుల గురించి తమ అభిప్రాయాలు నిక్కచ్చితంగా చెప్పేవారు.

వ్యాపారాల్లో మోసాలెలా జరుగుతాయో చెప్పేవారు. సేవాధర్మంలో అన్నిటికన్నా అన్నదానమే గొప్ప అనీ, శ్రీ శివానందాశ్రమంలో 10 సం॥లుగా అన్నదానం కొనసాగించారు. ఓ గుప్తదాత ఈ అన్నదానానికి సహకరించారన్నారే గాని ఆ దాత ఎవరో ఏనాడూ చెప్పలేదు.

ఆయా సమావేశాలకు వెళ్ళినా క్లుప్తంగా మాటాడేవారు. 2015వ సం॥లో జరిగిన ఒకటిరెండు సమావేశాలలో మాత్రం ఎక్కువ సమయం తీసుకుని ప్రసంగించారు. వీటిల్లో

**విమర్శించే వాతావరణంలో పెరిగితే ప్రతిదీ ఖండించడం నేర్చుకుంటారు**

వారు ప్రధానంగా దైవాసుర సంపద్విభాగ యోగంలోని విశేషాలు వివరించారు.

అభయం, దానం, చిత్తశుద్ధి, జ్ఞానయోగస్థితి, దమం, యజ్ఞం, అధ్యయనం, తపస్సు, ఆర్జవం, శాంతి, త్యాగం, అహింస, సత్యం, అక్రోధం, అపైశునం, దయ, అలోలత్వం, మృదుత్వం, అచంచలత్వం, బిడియం, ఓర్పు, శౌచం, ప్రతిభ, ధైర్యం, అద్రోహం, అగర్వం తదితర దైవీ గుణాలు అందరూ అలవరచుకోవాలని వివరించారు.

శ్రీ స్వామివారు తమిళనాడు ప్రభుత్వం స్వామి విజయేంద్ర సరస్వతిని అరెస్టు చేసినప్పుడు, రాజకీయ దురాగతాలను ఖండించారు. శ్రీ జయేంద్రుల అరెస్టును నిరసిస్తూ శివానంద భారతిలో వ్రాసిన వ్యాసాలను స్వాగతించారు.

అయితే శ్రీ స్వామి వారు ఉత్తరభారతంలో ఒకస్వామి, దక్షిణభారతంలో ఒక స్వామి వివిధ నేరారోపణలతో జైలుకు వెళ్లాల్సివచ్చిప్పుడు, ఇటువంటి కాముకులు స్వాములెందుకు కావాలని, ఆ అయిదు పది రోజులు వారిని విమర్శిస్తూనే ఉన్నారు. మాలాంటి వారి ముందు కూడా వారి వ్యవహారాల్ని తీవ్రంగా ఖండించారు. ఆ సందర్భంలో నేనో శతకం వ్రాస్తూ స్వామి వారి భావాలకు ఇలా పద్యరూపమిచ్చాను.

**ఆ॥వె॥ స్వామి దారి తప్పి కామిగా మారితే**
**పట్టిచేయవలయు పరిణయమ్ము**
**హిందుధర్మమునకు నిది మంచిమార్గమ్ము**
**నాటివేమనన్న నేటి మాట**

స్వామీజికి ఈ పద్యం వినిపించాను. అంతే మరి అన్నారు స్వామి.

2010-11లలో దివ్యజీవన సంఘం ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు దేశమంతటా జరిగాయి. తుల్జాభవన్లో 2015 మే 19 నాడు జరిగిన ఉత్సవ సభలో శ్రీ స్వామిజీ ముఖ్య అథితిగా పాల్గొన్నారు. అప్పుడు వారు శివానందులతో పాటు మిగతా వారిని కూడా ఉదాహరించి విశ్లేషించారు. స్వామి వివేకానందుల వారి తర్వాత ఆ స్థాయికి చెందినవారు శివానందులొక్కరే అన్నారు. వారు రచించి మనకందించిన 300 గ్రంథాలలో హిందూధర్మ సమగ్ర స్వరూపంతోపాటు ఉపనిషత్తుల్లోని వేదాంతమంతా దర్శనమిస్తుందన్నారు. మన వారు పండుగలు చేస్తుంటారు. అందులో శ్రీరామనవమి జన్మాష్టమి మొదలైన వెన్నో మనం

**చిన్నప్పుడు దేన్నైనా పట్టుకొని నిలబడగలగాలి. పెద్దయ్యాక దేన్నైనా తట్టుకొని నిలబడాలి**

చూస్తుంటాం. పండుగలు తంతుమాత్రంగానే జరుగుతున్నాయి. కాని తత్త్వం తెలుసు కోవడంలేదు. తెలుసుకొన్న వారు తెలియని వారికి చెప్పడంలేదు. మననం, ఆచరణ రెండూలేనప్పుడు ఇక ప్రయోజనమేముంటుంది. గీతా సారమంతా దైవాసుర సంపద్విభాగ యోగంలోనే ఉన్నది. దైవీగుణాలు అలవరచుకోండి. మీరు దైవంగా మారిపోతారు అని ఆ రోజు తమ ప్రసంగంలో మరెన్నో విషయాలు చెప్పారు స్వామిజీ.

శ్రీ స్వామి వారు ఆశ్రమంలో ఉదయం 5-30 గం ని. నుండి కార్యక్రమాల యోజన చేశారు. యోగ, యోగాసనాలు, గీతాపారాయణాలు, మందిరాల్లో పూజలు, అర్చనలు, నెలలో శ్రవణానక్షత్రం రోజున కల్యాణాలు, ధ్యానమందిరంలో సాయంకాలం ధ్యానం, సత్సంగం, ప్రవచనాలు, ప్రసాదవితరణ, శుక్రవారం, శ్రీయోగబాలాజీ వేంకటేశ్వర స్వామికి అభిషేకం, ఆయా నైమిత్తిక ఉత్సవ-అర్చనాది కార్యక్రమాలు, శ్రీలలితాంబికా ఆలయంలో అమ్మవారికి గురువారం నాడు అభిషేకాలు, యోగేశ్వరస్వామి స్ఫటిక లింగానికి ప్రతిరోజు అభిషేకం, నవగ్రహ పూజలు ... ఇలా ఒక యోజనాబద్ధంగా నిర్వహించే పద్ధతులేర్పాటు చేశారు.

సాయంకాలం సత్సంగానంతర ప్రసంగాల్లో కొన్నేళ్లుగా ప్రతి శని-ఆదివారాలు శ్రీశ్రీశ్రీ తత్త్వవిదానంద స్వాముల వారి ఆధ్యాత్మిక ప్రవచనాలు కొనసాగేట్టు చూశారు. అనేక సందర్భాలలో శ్రీశ్రీశ్రీ చిదానందస్వాముల తర్వాత నేను తత్త్వవిదానంద స్వాములవారిని గురువుగా చూస్తున్నాను అన్నారు. అనుష్ఠాన వేదాంత ప్రవచనాల్లో వారికి వారే సాటి అని కితాబునిచ్చారు. ఆశ్రమ నిర్వహణలో శ్రీ స్వాములవారి సలహాలు కూడా తీసుకొనేవారు. ఒక సందర్భంలో ఆశ్రమానికి శ్రీ స్వాముల వారి మార్గదర్శనాన్ని కూడా వారు అపేక్షించారు.

శ్రీ స్వాముల వారు ఆశ్రమంలోనూ, వివిధతీర్థ క్షేత్రాల్లోనూ ఘంటల కొలదిగా ధ్యానంలో ఉన్న సందర్భాలున్నాయి. 2012 నవంబర్లో వారు తిరుమలలో ఏడు రోజులుండి చాలా సమయం ధ్యానంలో నిమగ్నమై ఉన్నారు. అయితే ధ్యానానంతరం నిత్య-నైమిత్తిక కార్యక్రమాలలో ఒక కర్మయోగిగానే స్వామివారు పాల్గొన్నారు. ఎక్కడ ఉన్నా పని తాము చేయడం, చేయించడంలో వెనుకముందాడే వారుకారు.

పద్మారావునగర్లోని శివానందాశ్రమం సత్సంగాల్లో కూడా స్వామి వారు క్లుప్తంగా ప్రసంగించేవారు. ఈ ఆశ్రమంలోనే వారికి 2000వ సంవత్సరం జనవరి 6 నాడు స్వామి చిదానంద సరస్వతీ మహారాజ్ గారు సన్యాసదీక్ష ఇచ్చారు. దేశమంతటా పర్యటిస్తూ భక్తి

**ఆశించడం ఆపితే - ఆనందం మొదలవుతుంది. ...**

పారవశ్యంతో కీర్తనలు చేస్తూ ఆంధ్రప్రదేశ్‌లో స్వామి శివానందుల తత్త్వాన్ని వ్యాప్తం చేస్తున్న స్వామి దేవానందుల వారు (చిన్న స్వామివారు) అప్పుడిక్కడే ఉన్నారు. ఆ రోజు రాత్రి వారికి గుండెపోటు వచ్చింది. శ్రీ చిన్న స్వాముల వారిని మారేడుపల్లిలోని గీతా నర్సింగ్ హోంలో చేర్చారు. అక్కడి డాక్టర్ల సలహా మేరకు కేర్ హాస్పిటల్‌కు తరలిస్తుండగానే 2000 జనవరి 7వ తేది ఉదయం 10 గంటల 20 ని.లకు బ్రహ్మలీనులయ్యారు.

శ్రీ సత్యవ్రతానంద స్వాములవారు ఒక విచిత్ర సన్నివేశంలో ఉన్నారు. అయినా తమ గురుదేవుల సన్నిధిలో వారి కనుసన్నల్లో మెదులుతూనే అపూర్వ సేవలందించారు. వారి హృదయంలో శ్రీ చిన్న స్వామివారు చెరగని ముద్ర వేశారు. సన్యాస దీక్షకు పూర్వం, ఆ తర్వాత కూడా శ్రీ సత్యవ్రతానంద స్వాముల వారు తమ ఉపదేశ గురువులు శ్రీ చిదానంద స్వాముల వారి వెంబడి పర్యటనలలో ఉన్నారు. ఆ సందర్భంలో వారి ఉపదేశాలెన్నో విన్నారు.

**1) మానవ యత్నమంతా అఖండా నందం, శాంతీతృప్తికోసమే**

**2) ఆధ్యాత్మిక జీవనం అర్థం మనలో దైవీ గుణాలు అధికం కావడమే**

**3) వేదాంతమనగా దివ్యజ్ఞానం, దైవం గురించిన యథార్థసత్యం**

**4) వేదాంత పరిభాష నీకు చెప్పేది నీవు దివ్యుడవు అని**

**5) ప్రతి సాధకుని ధ్యేయం నిరంతర అభ్యాసం ద్వారా అజ్ఞానాంధకారం నుంచి తేజస్సువైపు ప్రయాణించడమే..**

ఇటువంటివే ఎన్నో శ్రీ సత్యవ్రతానందుల వారు విని ఉంటారు. ఆ కారణంగానే కొన్ని సందర్భాల్లో మా బోంట్లతో గురువును (స్వామి శివానందులను) మించిన శిష్యులు (శ్రీ చిదానంద స్వామి) అన్నారు. అయితే స్వామి చిదానందుల హృదయంలో స్వామి శివానందులు ప్రతిష్ఠితులైనారన్న సంగతి వారికి తెలియక కాదు. గురుదేవుల ఉపదేశమంత్రమున్నది. ధ్యానం జరుగుతూనే ఉన్నది. ఆశ్రమంలో ముజ్జిడ్డుగా కార్యక్రమాలుంటున్నాయి. రాష్ట్రంలో ప్రతి సం॥ దివ్యజీవన సంఘ సభలు జరుగుతున్నాయి.

1994లో హైదరాబాదులోని సత్యసాయి నిగమాగమంలో రాష్ట్ర దివ్యజవన సంఘం సభలు జరిగాయి. అప్పటికి శ్రీ స్వామి వారు ఇంకా దీక్ష తీసుకోలేదు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ దివ్యజీవన సంఘం, శ్రీ శివానందాశ్రమం కార్యదర్శిగా ఉన్న శ్రీ రావి రామమూర్తిగారికి, ఋషీకేశ్ కేంద్ర దివ్యజీవన సంఘంతో బాగా పరిచయాలున్నాయి. పూర్వాశ్రమ కార్యక్రమాలలో ఉన్న శ్రీ స్వామి వారితోనూ పరిచయాలున్నాయి. అప్పుడు ఏర్పడ్డ నిర్వాహక సంఘానికి కూడా వారు కార్యదర్శి అయ్యారు. అప్పుడే శ్రీ స్వామి వారికి

**... శాసించడం ఆపితే సంతోషం మొదలవుతుంది**

కోశాధికారి బాధ్యతనప్పగించారు. శ్రీమూర్తిగారు, శ్రీ స్వామివారు విశేషంగా పరిశ్రమించి ఆ సభలను విజయవంతం చేశారు. ఆ సభల్లో మిగిలిన ద్రవ్యాన్ని, ప్రస్తుతమున్న భవన నిర్మాణానికి ఉపయోగించారు. అప్పుడు ప్రస్తుత భవన స్థలంలో ఉన్న, శిథిల భవనాలను తీసివేయడానికి కార్యవర్గంలోని కొందరు అభ్యంతరం చెప్పినా, శ్రీరావిరామమూర్తి, శ్రీ స్వామి వారి కృషి కారణంగా, కేంద్రంలో అంతర్జాతీయ అధ్యక్షులుగా ఉన్న స్వామి చిదానంద సరస్వతీ మహారాజ్ గారి ఆశీర్వాదాలతో ఇంత దివ్యభవ్య భవన నిర్మాణం జరిగింది. ఈ నిర్మాణంలో పూర్వ అధ్యక్షులైన శ్రీ పల్లెంపాటి వేంకటేశ్వర్లు, శ్రీ రతనలాల్, శ్రీమతి తారా గారు విశేషసేవలందించారు. వీరందరూ ఆశ్రమానికి వివిధ రకాలుగా తోడ్పడి ఆశ్రమ వికాసానికి తోడ్పడ్డారు.

2007లో తిరుపతిలో సభలు జరిగినప్పుడు ఒక్క చేతిమీదుగా వారు నిర్వహించిన తీరు అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఒకపని చేయాలనుకొని నిశ్చయించుకొంటే, అది సాధించేవరకు శ్రమించే లక్షణం వారికుంది. ఇదేవిధంగా శ్రీయోగబాలాజీ ఆలయ నిర్మాణం చేయించారు. శ్రీ లలితాంబికా ఆలయం నిర్మించారు. గాంధీ ఆస్పత్రిలో శ్రీ శివానంద విశ్రాంతి మందిరం నిర్మించారు. ఇదిగోండి! మనం చదువుతున్న ఈ పత్రిక శివానంద భారతిని 14 సం॥ క్రింద ప్రారంభించారు.

శ్రీ శివానంద సేవా సమితి ఏర్పడింది. దాని ద్వారా స్వామి చిదానంద వానప్రస్థాశ్రమ నిర్మాణం ప్రారంభమయింది. ఆ నిర్మాణానికి దాదాపు 65 లక్షలు వెచ్చించడం జరిగింది. స్వామి దేవానంద గోసంరక్షణశాల కూడా ఇందులో అంతర్భాగమే. ఇది పూర్తి కావడం నేను చూస్తానో లేదో అంటుండే వారు. స్వామీజి అన్నట్లే జరిగింది.

వారు 1932 మే 10వ తేదీన జన్మించారు. 2016 ఫిబ్రవరి 11వ తేదిన బ్రహ్మలీనులయ్యారు.

శ్రీ స్వామి వారు భౌతికంగా లేరు ; వారి ఆశయాలున్నాయి. ఈ నిర్మాణంలో ఉన్న ఆశ్రమమూ ఉంది. ప్రచురణలూ ఉన్నాయి. యోగా క్లాసులున్నాయి. సత్సంగ కార్యక్రమాలూ ఉన్నాయి. అన్న ప్రసాద కార్యక్రమమూ ఉంది. నిత్య నైమిత్తిక కార్యక్రమాలెన్నో ఉన్నాయి. ఆలయాల నిర్వహణా ఉంది. 17 సం॥గా నడుస్తున్న ఈ శివానందభారతి మాస పత్రికా ఉంది. ఇంకేం ! ఇవన్నీ సమన్వయపరచి నిర్వహించే వారు భక్తులే ! భవిష్యత్తులోకి చూద్దాం!

**- ఆచార్య కసిరెడ్డి**

**సత్సంగము పరమునకు హేతువు. దుస్సంగము పతనమునకు హేతువు**

# GOODNESS LEADS TO GODLINESS

**- Swami Chidananda**

Blessed Immortal Souls! Radiant says of the Eternal Light Divine!

All on this earth pass, but He is the changeless abiding Reality that passes not, for He is without beginning and end amongst the uncertainties of this earth existence, one thing is certain that we are not permanent dwellers upon this planet. This earth life is but a fleeting episode in the great Life, which persists before birth and beyond the grave. It is a glorious opportunity granted to the individual soul to attain conscious knowledge of its eternal oneness with the Supreme Absolute Being, which is the source of his existence.

It is a rare chance of attaining the illimitable glory of absolute freedom from all limitations, going beyond even death and reaching that supreme experience of never-ending joy, immeasurable peace, divine splendour and wisdom-consciousness in union with the Divine, that is the prime purpose of your eixistence here as an embodied being, and that is the great duty and supreme task of fulfilment in this life-span. Devoid of this central meaning and purpose, life is but mere existence on the horizontal plane.

Live in the awareness of this great divine attainment. Let your whole life be a movement towards divine realisation. Whether we know it or not, even now we are sustained by the Divine—it is our source and eternal abode, the substratum of our consciousness, the very basis of our being. Our ultimate destiny is in the Divine. Therefore, look forward with hope, enthusiasm and zeal upon each sunrise as yet another precious day dawned for exerting more earnestly and zealously towards the goal of human life.

And while you live a life of such an unceasing quest towards the supreme attainment, live in simplicity, humility and nobility. Let all life be

**To be blind does not mean to be in darkness**

a radiation of virtue—the inner perfection that is inherent in each soul. Let it be an outflow and expression of goodness that is the truth of your being, for you are made in the image of God. Like Him, you are divine. Let your life, therefore, be an active manifestation of these divine qualities which are the essential part of your innermost Reality.

Awake to the realisation of your immortal nature. Lead the divine life. Withdraw the senses from objects, the mind from senses and yourself from the mind, and establish yourself in your inner centre. Be the unchanging One amidst the changing body-mind personality. Let the Spirit express Itself through the actions of the body and through thoughts and motives of the mind. Let the mind be full of love, purity and truth. That is divine life.

Physical exercises, control over breath, methods of concentration or meditation cannot bring any ultimate result if they are not based on spiritual living that is characterised by great purity, truth, love, compassion, self-control, selflessness, humility and service. These are the virtues that purify all dross and awaken the higher consciousness through their Sattvic power. Purity is the secret key to the mansion of divine experience. It is the greatest austerity, greatest penance and the greatest Yoga. The practice of techniques alone cannot give you God-consciousness. Techniques can supplement your living, but the Great Experience is an unfoldment that progressively comes upon one who lives the ideal life.

The Master always insisted that a life of virtue is the common basis of all Yoga—whether it is Vedanta, Karma-Yoga, Jnana-Yoga, Raja-Yoga or Hatha-Yoga. All practical religions are based upon it. There can be no superstructure of spiritual attainment and illumination without a life of sublime purity, goodness and idealism. You cannot dream of Yoga without a pure life. Aspirants, who are really earnest about spiritual attainment, can never afford to neglect or overlook this vital aspect.

**One's character is not visible in a mirror**

And the way to do it is to ever think about the all-perfect God, ever to meditate upon Him, ever to contemplate upon Him, to develop a great love for Him, and to adore Him as a great ideal and to ever remember Him.

'What you think constantly upon, that you become.' This is the supreme law in the realm of thought. Thought is a great power given to man by God. It can take you anywhere and make you anything. 'As a man thinketh, so he becometh'.

When he was pressed by his disciples, "What is the greatest commandment of all?" Jesus said, "Let me tell you. Love thy God with all thy heart, with all thy mind, with all thy soul, with all thy being, with all th might!" This is the secret of attaining Him. Your mind constantly dwells upon that to which your heart is given. So let your entire heart be given to that all-perfect Divine Being. Then perfection will start growing within you, because it is there inherently. Remember Him constantly. Adore Him, always contemplate upon Him, always wish to attain Him, and when the mind becomes saturated with the thought of the all-perfect Divine Being, then you move towards perfection, grow towards perfection.

Cultivate the habit of daily silence and inner communication with Him Ceaselessly affirm your Reality, "I am a child of the Divine. That perfection abides in me. I am not this body, nor this mind, nor the intellect. I am pure Spirit. I am the God-essence." Affirm this. Aspire to realise this consciousness. This is the way.

God bless you! May you make use of this wonderful human life, the great gift of God, to attain Him!

Hari Om Tat Sat! ✶

**Be careful ! Your each expression will leave an impression**

# SRI BHAGAVANNAMA BODENDRA SARASWATHI - A JEEVAN MUKTA IN JEEVA SAMADHI:

**(Continued from the previous issue)** **- Sivananda Muthuraman**

**YESYA SMARANA MAATHRENA NAMABHATHI PRAJAYATHE**

**TAM NAMAMI YATHIS SRESHTAM BHODENDRAM JAGATAM GURUM**

We are very fortunate to live in this Punya Bhoomi Bharat Desh wherein many Jeevan Muktas lived, became a jnani, attained Sidda Sareeram and living in Jeeva Samadhi. In this Article, I wish to brief about one such Jeevan Mukta Swamiji who lives in Jeeva Samadhi and bless the devotees.

It is said that –

**"PUSPESHU JAAATHI, PURUSHESHU VISHNU,**

**NAARISHU RAMBA AND NAGARESHU KANCHI":**

(Amongst varieties of beautiful flowers JAATHI pushpam takes precedence, amongst beautiful Divine Gods VISHNU takes precedence, amongst beautiful women RAMBA takes precedence, and amongst beautiful Kshetras KANCHI takes precedence).

In the beautiful KANCHI Punya Kshetra, there was an Agraharam called MANDANA MISHRA Agraharam, where a holistic Brahmin by name Kesava Panduranga lived. He hailed from Andhra Pradesh during the Madras Presidency period and subsequently moved to Kanchi Kshetram now in Tamil Nadu. His wife's name was SUGUNA. In the $16^{th}$ Century this holistic couple was blessed with a male child. The namakaranam ceremony was performed as per the custom. Parents analyzed the child's horoscope and found certain special features. The child was given the name PURUSHOTHAM.

Kesava Panduranga was serving the $58^{th}$ Pontiff SRI SWAMI ATMA BHODENDRA SARASWATHI in the Sri Kanchi Kamakoti Peetam at

**Remembrances are often life's lessons that were forgotten**

Kanchi Kshetram. One day while Kesava Panduranga was proceeding to the Sri Kanchi Kamakoti Petam, child Purshotham also accompanied his father. On seeing the $58^{th}$ Pontiff, child Purushotham made sashtanga namaskaram. Swamiji enquired from the nearby devotees whose child is this. Kesava Panduranga replied “ours”. Then Swamiji told him that from to-day onwards this child will be Mutt child. Parents thought that it is all God’s will. Purushotham was given Akshara abyasam at the age of five and in the seventh year Brahmopadesam (Upanayanam) was performed. Before he attained the age of sixteen he was taught Vedam, Vedantam and other Itihasa, Purana scriptural lessons in the Mutt. Purushotham took a sankalpa in the presence of Acharya to chant Rama Nama one lakh eight thousand times daily.

(Here I want to make a special mention that Sri Swami Sivananda Saraswathi Maharaj of Rishikesh also stressed the importance of reciting Sri Ram Nama to the devotees and started during the World War time round-the-clock of reciting this Taraka Mantra for world peace. This is being continued even to-day).

In the later years after his parent’s attainment of Sivaloka prapthi, Sri Atma Bhodendra Saraswathi looked at Purushotham and found that he is all fit to take over the in-charge of the Mutt Administration. Then he left for his vijaya yatra to Kasi (Banaras) to promote bhaktii cult among the people. Purushotham told Swamiji that he also wishes to accompany him. Swamiji told him that he has to stay for few days at Kasi and hence he can come later to Kassi. Purushotham agreed half-heartedly. In the Kasi Kshetra a Saint by name Sri Nrusimhasrami Swamiji was already camping and spreading the importance of Nama Japa to the people. Both met each other and discussed about the spreading of Nama Japa. At the same time Sri Swami Atma Bhodendra Saraswathi thought to start a similar spreading of Nama Japa in South India and decided that Purushotham will be the right choice for that to head. Hence Swamiji decided to appoint Purushotham as his successor to the Mutt.

**(To be continued)**

**There cannot be final result until you finish the effort**

# శ్రీ శివానంద ఆశ్రమ వార్తలు

**1)8-2-2019 - శనివారం - కఠోపనిషత్తు ఆవిష్కరణ**

2019 ఫిబ్రవరి 8వ తేదీన ఆశ్రమంలో ఉ॥ గం॥కు ఆవిష్కరణ జరిగింది. శ్రీ జక్కని వేంకటరాజం రచించిన ఈ గ్రంథాన్ని ఉపనిషద్ విద్యా ప్రచారకులు ఆచార్య మసన చెన్నప్ప గారికి అంకితమిచ్చారు. సభాధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి సరళ శైలిలో ఆర్షవిజ్ఞానం ఈ విధంగా తెలుగులోకి రావడం శుభపరిణామం అన్నారు. డా॥ వై.వి. కృష్ణకుమారి గ్రంథ పరిచయం చేశారు. సభానిర్వహణలో డా॥ వడ్లూరి ఆంజనేయరాజు, శ్రీ పి. విజయగోపాల్ పాల్గొన్నారు. ఎందరో పెద్దలు వచ్చిన ఈ సభ విజయవంతంగా జరిగింది. సభానంతరం మహాప్రసాదర వితరణ జరిగింది.

**2)10-2-2019 - ఆదివారం**

ఈ రోజు శ్రీ యోగబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి వార్షికోత్సవం జరిగింది. సాంప్రదాయకంగా సుప్రభాతసేవ తర్వాత, స్వామి వారికి అభిషేకం తర్వాత పూజా కార్యక్రమాలు జరిగాయి. 10.00 గంటల నుండి శ్రీ సుదర్శన హోమం జరిగింది. పూర్ణాహుతిలో ముగిసిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్న కార్యక్రమంలో బసంత పంచమి శుభసమయంలో శ్రీ సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. వార్షికోత్సవ, బసంత పంచమి పూజలో పాల్గొన్న భక్తులకు మహాప్రసాద వితరణ జరిగింది.

**3)11-2-2019 - సోమవారం - స్వామి సత్యవ్రతానంద గారి తృతీయ సమారాధన**

ఈ రోజు బ్రహ్మలీనులైన స్వామి సత్యవ్రతానంద మహరాజ్ వారి తృతీయ సమారాధన కార్యక్రమం జరిగింది. సాయంకాలం 5.00 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ముందుగా స్వామి వారి చిత్రపటానికి పూలమాలంకరణ, నామార్చన, గురుపాదుకా పూజ జరిగింది. తర్వాత జరిగిన ఆధ్యాత్మిక సభ జ్యోతి ప్రకాశనంతో ప్రారంభమైనది. శ్రీ సుధీర్ కుమార్ గారు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో విశిష్టమైన ఆధ్యాత్మికవేత్త, శ్రీ లలితాంబికా సుపీఠం సంస్థాపకులు, శ్రీ శుకబ్రహ్మాశ్రమ ఉత్తరాధికారులు, అఖిల భారత సాధుపరిషత్

**పవిత్రమైన ఆలోచనతో మాట్లాడినా లేదా ...**

అధ్యక్షులు పరమపూజ్య శ్రీ సంపూర్ణనందగిరి స్వామి వారు పాల్గొన్నారు. శ్రీ బొప్పన కృష్ణప్రసాద్ గారు సభ నిర్వహణగావించారు. వారు తమ తొలి పలుకులలో స్వామి సత్యవ్రతానంద వారు శివానంద ఆశ్రమ స్థాపనలో చేసిన సేవలను, ఆశ్రమ నిర్వహణలో వారు ప్రదర్శించిన శ్రద్ధను, భక్తులపట్ల వారు చూపిన ఆపాయ్యతా, అనురాగాలను సవిస్తరంగా తెలిపారు.

ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీమతి బొప్పన అరుణాదేవి గారు తమ ఉపన్యాసంలో స్వామి సత్యవ్రతానంద వారితో, ఎన్నో సంవత్సరాలుగా వారికిగల అనుబంధాన్ని, భక్తుల్లోని ప్రజ్ఞాపాటవాలను సునిశితంగా పరిశీలించి వారికి అనువైన సేవా కార్యక్రమాలను అందించే విషయంలో స్వామి సత్యవ్రతానంద వారు ప్రదర్శించిన విశ్లేషణ శక్తిని, స్వామి శివానంద వారి సందేశాలను తెలుగు పాఠకలోకానికి చేరవేయడంలో ఆశ్రమం తరఫున గ్రంథాలను తెలుగు భాషలో ముద్రణచేసి ఉచితంగా వితరణచేసిన విశేష సేవాకార్యక్రమాలను, ఉత్తేజిత కంఠంతో సభికులకు వివరించారు. వారి ఆశయాలు ముందు ముందు ఇంకా కొనసాగేలా భక్తులందరూ తమ వంతు బాధ్యతలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.

శివానంద ఆశ్రమ కార్యవర్గ సభ్యులు శ్రీ పోచంపల్లి వేంకటరావు గారు మాట్లాడుతూ దివ్యజీవన మహాసభలను జరపాలన్న స్వామి వారి అభిలాషను తెలియజేస్తూ, అంతా సవ్యంగా జరిగితే 2021లో మహాసభలు హైదరాబాద్‌లో జరుపుకునే అవకాశం లభించవచ్చుననీ, భక్తులందరూ అర్థ, అంగబలాన్ని సమర్పించి మహాసభలను విజయవంతం చేసి స్వామి వారి అభీష్టాన్ని నెరవేర్చాలని కోరారు.

శ్రీ తిప్పరాజు కొండల్‌రావు గారు మాట్లాడుతూ, స్వామి సత్యవ్రతానంద వారితో దశాబ్దం పాటు గల సాంగత్యాన్ని గుర్తు చేసుకుంటూ ఆశ్రమ సేవల్లో పాల్గొనే అవకాశం కల్పించారనీ, ముఖ్యంగా స్వామి శివానంద వారి గ్రంథాలను తెలుగు భాషలోకి అనువాదం చేసే పవిత్రమైన అవకాశాన్ని కల్పించి, ఆ తెలుగు భాషగ్రంథాలను ఆశ్రమం తరఫున ముద్రించి, ఉచిత వితరణచేసి ప్రోత్సహిస్తూ, తమలో ఎంతో సేవా స్ఫూర్తికి కలిగించారని తెలియజేశారు. స్వామి వారి విశాల హృదయానికి ఇది తార్కాణం అన్నారు.

శ్రీ సంపూర్ణానందగిరి స్వామి వారు తమ ఆధ్యాత్మిక ప్రవచనంలో వారికి స్వామి దేవానంద వారు, స్వామి సత్యవ్రతానంద వారితోగల పరిచయాన్ని గుర్తుచేసుకుంటూ, స్వామి సత్యవ్రతానంద సార్థక నామధేయులనీ, సత్యంపట్ల వారికి గల నిష్ఠను కొనియాడారు. ప్రతి

... లేదా పని చేసినా ఆనందం మన వెన్నంటే ఉంటుంది

మానవుడు తన జీవన యానంలో సత్యపాలన చేయాలనీ, అదే లౌకిక జీవనంలో, ఆధ్యాత్మిక జీవితాలలో అతిముఖ్యమైన సాధనగా వివరించారు. శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో సత్యంపట్ల అర్జునునికి అందించిన సందేశాలను ప్రముఖంగా ఉటంకిస్తూ ఆ సందేశాలను ప్రతి సాధకుడు పాటించి తమ జీవితాన్ని సార్థకం చేసుకోవాలని తమ ప్రవచనంలో ఉద్ఘాటించారు.

స్వామి సత్యవ్రతానంద వారి ఆరాధనా సందర్భంగా, దివ్యాంగులకు వీల్‌చైర్‌లను ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఆశ్రమంతో అనుబంధం కలిగి ఉన్న ప్రతి స్త్రీ మూర్తికి వస్త్రాలను వితరణ చేశారు.

అత్యంత పవిత్రమైన వాతావరణంలో జరిగిన ఈ ఆరాధనా కార్యక్రమం మహాప్రసాద వితరణతో ముగిసింది.

**4)16-2-2019 - శనివారం - పుల్వామా అమర జవానులకు శ్రద్ధాంజలి**

2019 ఫిబ్రవరి 16వ తేదీన శ్రీశ్రీశ్రీ తత్త్వవిదానంద సరస్వతీ స్వామిజీ వారి సన్నిధిలో ఫిబ్రవరి 14న పాక్ ముష్కరుల దాడిలో మరణించిన అమర జవానులకు ఆశ్రమం శ్రద్ధాంజలి ఘటించింది. 200 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సభలో ఆచార్య కసిరెడ్డి దేశరక్షణ పౌరుల బాధ్యత గురించి ప్రసంగించారు. అందరు వందేమాతరం, భారత్ మాతాకి జై నినాదాలు చేశారు. క్రొవ్వత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు.

**3.** వచ్చే నెలలో శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని యోగా బాలాజీ మందిరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి కల్యాణం జరుగును.

**4.** ప్రతి శని, ఆదివారాల్లో సాయంకాలం 6-00 గంటలకు స్వామి తత్త్వవిదానంద గారిచే భగవద్గీతపై ప్రవచనాలు జరుగుతున్నాయి.

## వివిధ శాఖలలో జరిగే శివానందాశ్రమ ఆశ్రమ వార్తలు - పూర్ణిమ సత్సంగ్, స్వామి శివానంద లైబ్రరి, కాచిగూడ

స్వామి శివానంద లైబ్రరి కాచిగూడలో 20-02-2019 రోజు జరిగిన పూర్ణిమ సత్సంగ్‌లో స్వామి ముకుందానంద సరస్వతీ రచించిన : **"సనాతన ధర్మం దాని విశిష్టత"** అనే గ్రంథంపై సమీక్షను గురుదేవ్ స్వామి శివానంద మహారాజ్ భక్తుడు శ్రీ పప్పు రాఘవేందర్‌రావు గారు ఎంతో విపులంగా చేశారు. సత్యం, ధర్మం, శాశ్వతమైన విషయాలని, అయితే ధర్మం దేశ కాల పరిస్థితులనుబట్టి కొంత మారవచ్చని చెప్పారు. ధర్మానికి భారతదేశం సనాతనం, పురాతనం, నూతనం అయిన విషయాలను సనాతన ధర్మ ప్రబోధములు ఎంతో సమన్వయంతో

**డబ్బే ముఖ్యం అనుకునే వారికి మంచితనం తక్కువ. ...**

చూడగలరని, భారతీయ సంస్కృతి అనగా ఋషి సంస్కృతియని, ఋషులు లోకకళ్యాణం కొరకు తపస్సుచేసి దార్శనికులు అయినారని సనాతన ధర్మంలో సంస్కృతి ఒక భాగం అని వారు వివరించారు.

సత్యంకోసం సత్యహరిశ్చంద్రుడు అన్నింటిని త్యజించారని సత్యమునే పలుకుము, ప్రియమునే పలుకుము, సత్యమైనను అప్రియమును పలుకకుము, ప్రియముగదా అని అమృతము వాడకుము అని మన సంస్కృతిని నొక్కి వక్కాణించరని చెపుతూ, నేటి కాలంలో అందరూ సత్యవ్రతా దీక్షాపరులు కావాలని వారు విన్నవించారు. ఆశ్రమ ధర్మాలన్నీ పరమాత్మ దర్శనానికి నిచ్చెనలాంటివని వారు అభిప్రాయపడ్డారు.

శ్రీ తిప్పరాజురాజు కొండల్‌రావు మాట్లాడుతూ సత్యం, దయ, కామం, ప్రేమ ఇవన్నీ ధర్మానికి నాలుగు స్తంభాలని గురుదేవులు స్వామి శివానంద మహారాజ్ తన జీవితంలో వైద్యుడిగా మరియు సన్యాసిగా సత్యం, ధర్మం అనే విషయాలకు ఎంతో ప్రాముఖ్యతనిచ్చారని చెప్పారు.

## జాతిపిత, మహాత్మాగాంధి 150వ జయంతి ఉత్సవములు

గాంధి మహాత్ముని 150వ జయంతి వేడుకలను భారత దేశమేకాక, విదేశాలలోని అన్ని సభ్య సమాజాలు ఎంతో ఉత్సాహముతో జరుపుకుంటున్న తరుణంలో, భారతీయులమైన మనం మహాత్ముని బోధనలను నేటి యువతీ యువకులకు తెలియ చెప్పాల్సిన అవసరం ఎంతో ఉందని, సత్సంగ్‌కి విచ్చేసిన గాంధేయవాది, న్యాయవాది శ్రీ చయనం రవీంద్రనాథ్ సభికులకు విన్నవించారు.

మహాత్మా గాంధీ చిన్న నాటి నుండి నిజాయితీగా ఉండేవారని, పాఠశాలకి విచ్చేసిన విద్యాశాఖాధికారి పెట్టిన పరీక్షలో తాను తప్పుడు సమాధాన వ్రాయడం గమనించిన ఉపాధ్యాయుడు ప్రక్క పిల్లలు వ్రాసే దానిని చూడమని సూచించగా, దానిని పట్టించుకోగా, తనకి తోచిన దానిని వ్రాసారని శ్రీ రవీంద్రనాథ్ చెప్పారు.

గాంధీ మహాత్ముడు బాల్య వివాహాలలోని అనైతిరను గమనించారని, పరస్త్రీలయెడ గౌరవభావంతో ఉండేవారని, మద్యమాంసాలకు దూరంగా ఉండేవారని, న్యాయవాదిగా ఎప్పుడు తప్పుడు కేసులను చేపట్టలేదని వారు చెప్పారు. బ్రహ్మచర్యను దీక్షను అవలంభించి, ఆరోగ్యానికి ఉపవాస నియమాన్ని పాటించేవారని వారు చెప్పారు

**... మంచితనమే ముఖ్యం అనుకునే వారికి డబ్బు తక్కువ**

దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహము జరిగిన కాలంలో తాను రైలు పెట్టెలోనూ, గుర్రపు బండిలోనూ, దక్షిణాఫ్రికా రాష్ట్రపతి భవనం యెదుట దెబ్బలు తినిన అనుభవాలు తన వ్యక్తిగత అవమానంగా కాక, అక్కడ భారతీయులకు జరిగిన అవమానంగా భావించి, వారి బానిసత్వము బాపుటయే వారి జీవిత లక్ష్యముగా పెట్టుకున్నారన్నారు.

భారతదేశానికి స్వాంత్ర్యం సాధించటంలో సత్యం, అహింసలకే తమ ఆయుధాలుగా పెట్టుకున్న గాంధి మహాత్ముడు మనకు ప్రాతఃస్మరణీయుడని శ్రీ రవీంద్రనాథ్ చెప్పారు.

దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి ఆయన పిలుపునకు ఎందరో మహానుభావులు తమ ఆస్తిపాస్తులను పోగొట్టుకోవటమే కాక, ప్రాణత్యాగాలు చేశారని వారు అన్నారు.

తమ ఆత్మ కథలో స్త్రీ శక్తి గూర్చి చెప్తూ, మానవ జాతి

హృదయం మీద స్త్రీ ప్రభావాన్ని మించింది మరియొకటి లేదని, స్త్రీలు అబలలు కారని, వారిలో త్యాగం, నమ్రత, శ్రద్ధ, వివేకం, కష్ట సహనం ఎక్కువ పాళ్ళున్నాయని మహాత్మాగాంధీ తెలియపరిచారన్నారు. మన దేశంలో ప్రాచీనకాలం నుండి స్త్రీకి సముచిత స్థానం ఉన్నప్పటికి, ఆమెలో ఉన్న లోకకల్యాణ శక్తులు ప్రకటితం కావటానికి, గాంధీజీ యొక్క దేశ సేవా కార్యకలాపాలవల్ల సాధ్యమయిందని వారు వివరించారు.

గాంధీ మహాత్ముని సత్యం, అహింస, బోధనల ప్రచారం ఆవశ్యకత నేడు ఎంతో ఉందని, దీనికి మనమందరం ముఖ్యంగా యువతీ యువకులు పూనుకోవాలని శ్రీ రవీంద్రనాథ్ సూచించారు.

**వార్తా కూర్పు : ఎస్. వెంకటేశ్వరరావు**
**9490994572**


**ప్రతి నెల బుధవారం రోజు**

**ఉచిత సంస్కృత**

**క్లాసులు సా॥ 6 గం॥ల నుండి 8.00 గం॥ల వరకు**
**జరుగుతున్నాయి. రండి ! సంస్కృతం నేర్చుకోండి !**
**సంస్కార భారతాన్ని నిర్మించండి !**


**జీవితం పెట్టే పరీక్షలకు భయపడి వెనుదిరుగకు, ఆత్మ విశ్వాసంతో ...**

ఈ మాస విశేష భారతి

శ్రీ విళంబి మాఘ బహుళ దశమి నుండి ఫాల్గుణ కృష్ణ ఏకాదశి ఆదివారము వరకు

# 2019 మార్చి

02-03-2019 శనివారం, శ్రీ గురూజీ జయంతి
- మాఘ బ॥ ఏకాదశి

04-03-2019 సోమవారం, మాసశివరాత్రి, మహాశివరాత్రి
పూర్వాభాద్ర కార్తె

06-03-2019 బుధ, అమావాస్య

10-03-2019 ఆదివారం, శాంతి చతుర్థి, గణేశవ్రతం

13-03-2019 మంగళవారం లక్ష్మీ సీతాపూజ, అమలకం

14-03-2019 బుధవారం, మీన సంక్రాంతి

18-03-2019 సోమ ఉత్తరభాద్ర కార్తె

19-03-2019 మంగళవారం కామ దహనం

20-03-2019 బుధవారం హోళికోత్సవం

23-03-2019 బుధవారం, భగత్సింగు,
రాజ గురుసుఖదేవ్‌ల బలిదానం

24-03-2019 గురువారం, సంకష్టచతుర్థి

31-03-2019 ఆదివారం, రేవతి కార్తె

Printed and Published by G. SUDHIR KUMAR on behalf of A.P. DIVINE LIFE SOCIETY, Printed at Natural Gray Offset Press, # 10-2-11/1, Opp. IDBI Quarters, I.T. Towers Road, AC Guards, Hyderabad - 500004, Published at A.P. DIVINE LIFE SOCIETY SIVANANDA ASHRAM 6-1-110, Padmaraonagar, Secunderabad - 500 025 Editor Acharya Kasireddy Venkat Reddy.
Tel : 040-27503274

... ముందడుగు వేసి శిఖరాగ్రానికి చేరడానికి ప్రయత్నించు

## STATEMENT OF OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT **SIVANANDA BHARATHI**

Form IV (See Rule 8)

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Secunderabad |
| 2. | Periodicity of Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | Indigo Press |
| 4. | Whether Citizen of India | : | YES |
| 5. | Address | : | Red Hills,<br>Hyderabad - 500 004 (A.P.) |
| 6. | Publisher's Name | : | G. Sudhir Kumar |
| 7. | Whether Citizen of India | : | YES |
| 8. | Address | : | H.No. 6-1-110<br>A.P. Divine Life Society<br>Padmaraonagar, Sec'bad-25 |
| 9. | Editor's Name | : | Prof. Kasi Reddy Venkat Reddy |
| 10. | Whether Citizen of India | : | YES |
| 11. | Address | : | H.No. 6-1-110<br>A.P. Divine Life Society<br>Padmaraonagar, Sec'bad-25 |
| 12. | Name and Address of Individuals who own the News Paper | : | **Sivananda Bharathi Society**<br>H.No. 6-1-110<br>Padmaraonagar, Sec'bad-25 |


I, Swamy Satyavratananda, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

(Sd/-)
**G. SUDHIR KUMAR**

31-3-2019

స్నేహమంటే మాటలు పంచుకోవటం కాదు, మనసులు పంచుకోవటం

వేమన వేదాంతం



# దైవబలమే బలం!

అల్పుడైన నేమి ? అధికుడైన నేమి ?
చెప్పవలయు రీతి చెప్పినాడ !
హరుని యెఱుక లేక ఆకులల్లాడునా !
విశ్వదాభిరామ వినురవేమ ! (వే. ప : 88)

**అర్థం :** అల్పుడు + ఐనను + ఏమి = చిన్నవాడైతే నేమిటి? అధికుడు + ఐనను + ఏమి = పెద్దవాడైతేనేమిటి ? చెప్పవలయు = చెప్పవలసినట్టి ; రీతి = విధానం – పద్ధతి ; చెప్పినాడ = చెప్పినాను ; హరుని = పరమేశ్వరుని ; ఎఱుకలేక = తెలపకుండా ; ఆకులు= ఆకులు = పత్రాలు ; అల్లాడునా = కదలుతాయా !

**భావం :** వినండి ! నేను సరిగా చెబుతున్నాను ; చెప్పాను కూడా ; అది ఇది ; కొద్ది వాడైనా గొప్ప వాడైనా (అంటే గుణాలను బట్టి), అందరూ తెలుసుకోవాల్సింది. శివుని ఆజ్ఞలేనిది ఆకైనా కదలదు సుమా ! (శివుని ఆజ్ఞలేనిది చీమైనా కుట్టదు).

**వ్యాఖ్య :** కంకర్ కంకర్ మే శంకర్ హై ! (కణం కణంలో పరమాత్ముడున్నాడు). పరమాత్మ సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. **(ఈశావాస్యమిదం సర్వమ్ అని ఈశావాస్యోపనిషత్తు అంటున్నది)** ఈ ప్రపంచంలో చిన్నా పెద్ద అనే మాటలేదు. నేను యోగి వేమన్నను చెబుతున్నా! ఇప్పటికే చెప్పినాను. అందరూ గుర్తించవలసిన అవసరమున్నది. ఆ పరమేశ్వరుని ఆజ్ఞలేక ఆకు కూడా అల్లాడదు. ఇదొక సామెతగా వ్యాప్తమై ఉంది. శివుని ఆజ్ఞ లేనిది చీమకూడా కుట్టదు అని.

అంటే సర్వవ్యాపి అయిన (విశ్వం–విష్ణుః) పరమాత్మ వల్లనే అన్నీ జరుగుతున్నాయి. ఆ విశ్వాసంతోనే మనం జీవించాలి. నేను చేస్తున్నాను అనుకొంటే మనిషిలో అహంకారం వస్తుంది. ఆయన చేయిస్తున్నాడు, నేను చేస్తున్నాను అనే భావనతో మనం జీవించాలి. అప్పుడే శాంతి–సౌఖ్యాలు ఉంటాయి.

– *ఆచార్య కసిరెడ్డి*

Date of Publication : 23.01.2019 - Posted pm 26, 27th

LICENCE NO. H/SD/ 517 /18-20 DT. 12.03.2018

RNI No. TELBIL/2002/08571

SIVANANDA BHARATHI (MONTHLY)

## మంచి శ్లోకం

### ధర్మమర్యాద దాటరాదు

శ్లో॥ సత్యజేద్ ధర్మమర్యాదా - మపిక్లేశ దశాం శ్రితః ।
హరిశ్చంద్రోహి ధర్మార్థీ - సేహెూ చండాల దాసతామ్ ॥

భావం : ఎటువంటి కష్టాల్లో ఇరుక్కొన్నా సరే, ధర్మమనే హద్దు దాటరాదు. ధర్మవాంఛ కారణంగానే హరిశ్చంద్ర మహారాజు చండాలుని సేవ చేశాడు (చారు చర్య).

## మంచి పద్యం

### గురువు దైవమే !

కం॥ జరయును మృత్యువు మొదలుగ
మరలగ రాకుండునట్టి మార్గంబేదో
గురుతెఱుగ జేయుమని శ్రీ
గురుగురుని భజింపవలయు గువ్వలచెన్నా !

భావం : వార్ధక్యం మరణం ప్రాప్తించకుండా, ఉపాయం ఏదన్నా ఉందేమో చెప్పవలసిందని గురువులకు గురువైన ఆ భగవంతుణ్ణి ప్రార్థించాలి (గువ్వల చెన్నా శతకం).

**Book - Post (Printed Matter)**

To

______________________________

______________________________

______________________________

______________________________

Printed and Published by
G. SUDHIR KUMAR on behalf of A.P. DIVINE LIFE SOCIETY,
Printed at Natural Gray Offset Press, # 10-2-11/1, Opp. IDBI Quarters,
I.T. Towers Road, AC Guards, Hyderabad - 500004,
Published at : A.P. DIVINE LIFE SOCIETY SIVANANDA ASHRAM
6-1-110, Padmaraonagar, Secunderabad - 500 025.
Email : apdlssec@gmail.com, website : http://apdls.yolasite.com
Editor : Acharya Kasireddy Venkat Reddy.
Tel : 040-27503274